ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు

5

మంగళవారం 9 జూలై 2024

అర్జీదారులు సంతృప్తిపడేలా పరిష్కారం చూపాలి : కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్) జూలై 8: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీ దారులు సంతృప్తిపడేలా సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్‌హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలన్నారు. అందిన ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు బాధ్యతాయుతంగా వందశాతం పరిష్కరించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి అవగాహన చేసుకొని క్షేత్రస్థాయిలో వెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ వెంకటసుబ్బయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, జూలై 8: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ కృష్ణారావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 53 మంది ఫిర్యాదుదారులు ఎస్పీకి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. జిల్లాలోని బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే అర్జీలను పరిశీలించి చట్ట పరిధిలో విచారించి త్వరతగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎరువుల దుకాణాలపై తనిఖీలు

● 18.60 టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల



మదనపల్లె పట్టణంలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బృందం సభ్యులు

మదనపల్లెటౌన్, జూలై 8: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు జిల్లాలోని అన్ని పట్టణాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మదనపల్లె పట్టణంలో రాష్ట్రస్థాయి వ్యవసాయశాఖ అధికారుల బృందం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసింది. కర్నూల్ ఏడీఏ ఎన్.పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణనాయక్, అన్నమయ్య జిల్లా టెక్నికల్ ఏవో వెంకటమోహన్‌లు పలు ఎరువుల దుకాణాలను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకుండా నిల్వ చేసిన రూ.5.02 లక్షల 18.60 టన్నుల ఎరువుల విక్రయాన్ని నిలుపుదల చేశారు. ఏడీఏ పాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఏవో నాగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక జడ్పీ ప్రజాపక్షం..!

● నిన్నటి వరకు ఏకపక్షంగా జడ్పీ సమావేశాలు
● సాధారణ ఎన్నికల తరువాత పరిస్థితులు తారుమారు
● వైసీపీ ఓటమితో అంతర్మధనంలో పాలకమండలి
● ఇకపై అడ్డగోలు నిర్ణయాలకు అడ్డుకట్ట
● నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం
● మొదటిసారిగా కొత్త సారధులు



జడ్పీ కార్యాలయం

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంతో జడ్పీ పాలకమండలిలో పరిస్థితులు తారుమారయ్యాయి. నిన్నటి వరకు జడ్పీ సర్వసభ్య సమావేశాలు ఏకపక్షంగా సాగగా.. ఇకపై ప్రజాపక్షంగా కొనసాగనున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 10 ఎమ్మెల్యే స్థానాలు ఉండగా 2024 సాధారణ ఎన్నికల్లో వైసీపీ 3 స్థానాలకే పరిమితమైంది. గతంలో ఒక్క ఎమ్మెల్యే స్థానం కూడా లేని టీడీపీ కూటమి 7 ఎమ్మెల్యే స్థానాలను దక్కించుకుంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి సారిగా మంగళవారం జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నుంచి రవాణాశాఖ మంత్రితో పాటు మిగిలిన ఆరుగురు ఎమ్మెల్యేలు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ తదితరులు హాజరవుతున్నారు. దీంతో జడ్పీ పాలకమండలి వైసీపీ చేతిలో ఉన్నప్పటికీ సమావేశాలు ఇకపై ఏకపక్షంగా కాకుండా.. ప్రజాపక్షంగా కొనసాగుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

కడప(రూరల్), జూలై 8: జగన్ ప్రభుత్వ హయాంలో 2021లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని 50 జడ్పీటీసీ స్థానాలలో 38 వాటిని ఏకగ్రీవం చేసుకుని మొత్తం 48 స్థానాలతో జడ్పీ పాలకమండలిని వైసీపీ కైవశం చేసుకుంది. ఈమేరకు ఒంటిమిట్ట మండలం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకేపాటి అమరనాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా 2021 సెప్టెంబర్ 25న ప్రమాణస్వీకారం చేశారు. అప్పటి నుంచి దాదాపు 3 సంవత్సరాల పాటు 12 స్టాండింగ్ కమిటీ సమావేశాలు, సర్వసభ్య సమావేశాలు జరిగాయి. మొత్తం 50 మంది జడ్పీటీసీలలో 48 మందితో పాటు 10 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు వైసీపీ వారే కావడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగింది. సభా సంప్రదాయాల ప్రకారం కాకుండా అడ్డగోలు సమావేశాలను సాగించి ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపై ఈ పద్ధతులకు అడ్డుకట్ట వేయనున్నారు. రాజంపేట ఎమ్మెల్యేగా ఆకేపాటి గెలుపొందడంతో ఆయన జూన్ 8న జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న జె.శారదను ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా కలెక్టర్ నియమించారు. ఆమె ఆధ్వర్యంలో నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది.

కొత్త సారధులు

మంగళవారం నిర్వహిస్తున్న జడ్పీ సమావేశానికి కొత్త సారధులు హాజరవుతున్నారు. రాయచోటి ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో పాటు కమలాపురం, కడప, మైదుకూరు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, పుట్టా సుధాకర్‌యాదవ్ మొదటి సారిగా జడ్పీ సమావేశానికి హాజరవుతున్నారు. వీరితో పాటు ఐదేళ్ల తరువాత జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, 15 సంవత్సరాల తరువాత ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సైతం రానున్నారు. నిన్నటి వరకు జడ్పీ చైర్మన్‌గా సమావేశాలను కొనసాగించిన ఆకేపాటి అమరనాథరెడ్డి రాజంపేట ఎమ్మెల్యే హోదాలో, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ సమావేశానికి వచ్చే అవకాశం ఉంది. పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ఏరోజూ జడ్పీ సమావేశానికి రాలేదు. నేడు కూడా వచ్చే అవకాశం లేదు. అలాగే కడప, రాజంపేట ఎంపీలుగా వైఎస్ అవినాశ్‌రెడ్డి, మిధున్‌రెడ్డి గెలుపొందారు. గతంలో కూడా వీరిద్దరూ ఎంపీలుగా ఉన్నారు. ఇప్పటి వరకు జడ్పీ సమావేశాలకు ఎంపీ మిధున్‌రెడ్డి ఏనాడూ హాజరుకాలేదు. అవినాశ్‌రెడ్డి ఆడపాదడపా హాజరై ఇలా వచ్చి అలా వెళ్లేవారు. మంగళవారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశానికి వీరు హాజరయ్యేది ప్రశ్నార్థకమే. ఇకపోతే కలెక్టర్ లోతేటి శివశంకర్ కూడా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం తరుపున మొదటి సారిగా జడ్పీ సమావేశానికి రానున్నారు.

నేటి జడ్పీ సమావేశంపై జనం ఆశలు

మంగళవారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంపై జనం గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదివరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కానీ, వైసీపీ జడ్పీ పాలకమండలి కానీ జిల్లా ప్రజల సమస్యలను గాలికి వదిలేసింది. తద్వారా జిల్లా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది. రైతులు, రైతు కూలీలు, భవననిర్మాణ కార్మికులు, ఉపాధి కులీలు, విద్యార్థులు, నిరుద్యోగులు, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో నేడు జరిగే జడ్పీ సమావేశంలో టీడీపీ ప్రజాప్రతినిధులు ప్రజాపక్షంగా నిలిచి జిల్లాలోని సమస్యలపై అర్థవంతంగా చర్చించి పరిష్కారం చూపుతారని గంపెడాశతో జనం ఎదురుచూస్తున్నారు.

ఇవీ సమస్యలు

- ఐదేళ్లుగా వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయరంగం దారుణంగా దెబ్బతిని సంక్షోభంలో కూరుకుపోయింది. కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరి కొందరు వ్యవసాయాన్ని వదిలి ఉపాధి కోసం పట్టణాల బాటపట్టారు. నకిలీ విత్తనాలు రైతులను బెంబేలు ఎత్తించాయి. బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు హల్‌చల్ చేశాయి. పంట ఉత్పత్తులు అమ్ముదాంటే అడవి... కొందామంటే కొరిగా మారాయి. ఎరువులు, పురుగుమందుల ధరలు అమాంతంగా పెరిగాయి.
- ఐదేళ్లుగా సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ల నిర్వహణను టెండర్లు లేకుండానే వైసీపీ నేతలు దక్కించుకుని నిధులను నీళ్లలా తాగేవారు. దీంతో గ్రామీణ ప్రాంత నీటిసరఫరాలో కీలకంగా వ్యవహరిస్తున్న జిల్లాలోని 25 సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ల నిర్వహణ లోప భూయిష్టంగా సాగుతోంది. ప్రజలు నీటి సమస్యతో అల్లాడుతున్నారు.
- వైసీపీ పాలనలో గ్రామీణ రహదారులు అధ్వాన్నంగా మారాయి. ప్రయాణం ఉయ్యాలా జంపాలా.. లాగా మారింది. పంచాయతీరాజ్‌శాఖకు నిధులు లేకపోవడంతో అధికారులు ఏమిచేయలేక కొట్టుమిట్టాడుతున్నారు.
- భవన నిర్మాణ రంగం కుదేలైంది. సిమెంట్, ఇసుక, ఇటుకల ధరలు అమాంతంగా పెరిగాయి. బస్తా సిమెంట్ రూ.350 నుంచి రూ.400ల వరకు పలుకుతోంది. దీంతో గృహనిర్మాణ వ్యవస్థ ప్రజలకు భారంగా మారింది. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ సారధి సీఎం చంద్రబాబునాయుడు సోమవారం నుంచి ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడంతో భవన నిర్మాణ రంగానికి పూర్వవైభవం రానుంది.
- వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ కునారిల్లింది. చాలా వరకు పాఠశాల భవనాలు పాడై ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయి. విద్యార్థులకు తగినన్ని బల్లలులేవు. నైట్ వాచ్‌మెన్‌లు లేనికారణంగా పాఠశాలల్లోని విలువైన వస్తువులు చోరీలకు గురవుతున్నాయి. ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. 80శాతం వసతి గృహాలలో తాగునీరు, ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. నాడు-నేడు పనుల కింద కోట్లాది రూపాయలను ఖర్చు చేసి పైపై మెరుగులు దిద్ది దండుకున్నారన్న ఆరోపణలు మిన్నంటుతున్నాయి.
- జిల్లాలో ఉక్కు పరిశ్రమ, ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పిన వైసీపీ మాటతప్పింది. దీంతో నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక అలమటిస్తున్నారు.
- స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ ద్వారా గ్రామ స్థాయిలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా సౌకర్యాలు లేక నీరసించి పోతున్నాయి. చాలా వరకు అద్దెభవనాలలో నడుస్తున్నాయి. శిశువుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా ఇందుకు తగ్గట్టుగా కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.
- వైసీపీ పాలనలో చిన్న, మధ్యతరహా, భారీ నీటి వనరుల నిర్మాణాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. వీటి నిర్వహణకు తగినన్ని నిధులు లేక కునారిల్లిపోతున్నాయి. నీటి వనరుల అభివృద్ధి పేరుతో మంజూరైన నిధులను తూతూమంత్రంగా ఖర్చుచేసి గుటకాయస్వాహా అనిపించారు.
- వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని ఆసుపత్రులలో సిబ్బంది కొరత వేధిస్తోంది. 24 గంటల ఆసుపత్రులలో చాలా వరకు సిబ్బంది అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- విద్యుత్ శాఖకు సంబంధించి చాలా వరకు వ్యవసాయ సర్వీసులకు హైఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కింద సపరేట్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు అధికం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం..

అటకెక్కిన భూసార పరీక్షలు

● మూతపడిన భూసార పరీక్ష కేంద్రాలు
● ఖరీఫ్, రబీలో రైతుల అగచాట్లు
● మట్టి నమూనాలు కడపకు తరలింపు

మదనపల్లెటౌన్, జూలై 8: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగంలో ప్రధానమైన భూసారపరీక్షలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. జిల్లాలో రెండు భూసార పరీక్ష కేంద్రా లు వుండగా అందులో ఒకటి మదనపల్లె మార్కెట్ యార్డులో, రెండోది రాయచోటి మార్కెట్‌యార్డులో వున్నాయి. కాని వైసీపీ అధికారంలోకి వచ్చాక భూసార పరీక్ష కేంద్రాలకు అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో నాలుగేళ్లుగా ఈ రెండు భూ సార పరీక్ష కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో రూ.కోట్లు వెచ్చిం చి భూసార పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పరికరాలు, టెస్టింగ్ మిషన్స్ మరమ్మతులకు గురయ్యాయి. దీంతో జిల్లాలోని వేలాది మంది రైతులు వారి పొలాల్లోని మట్టి నమూనాలను కడప భూసార పరీక్ష కేంద్రానికి పంపాల్సి వస్తోంది.

నాలుగేళ్లుగా భూసార పరీక్ష కేంద్రాలు మూత

జిల్లాలోని రైతులు తమ పొలాల్లో మట్టి సాంద్రత తెలుసుకోవడానికి మదనపల్లె మార్కెట్ యార్డులో ఒకటి, రాయచోటి మార్కెట్ యార్డులో రెండో భూసార పరీక్ష కేంద్రాన్ని ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. కానీ 2019 సంవత్సరంలో వైసీపీ అధికారంలోకి రావడంతో వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టలేదు. దీంతో జిల్లాలో రైతులకు ఎంతో ఉపయోగపడే భూసార పరీక్ష కేంద్రాలకు నిధులు మంజూరు చేయలేదు. భూసార పరీక్ష కేంద్రంలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో 20వేల మట్టి నమూనాలను పరీక్ష చేసేందుకు రసాయనాలు, కంప్యూటర్లు, సిబ్బంది నిర్వహణకు ఒక్క రూపాయి కూడా వైసీపీ ప్రభు త్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఇక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని అగ్రీల్యాబ్‌లకు డిప్యుటేషన్‌పై పంపించారు. ఇదిలా వుండగా రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన యంత్రాలు, పరికరాలు, కంప్యూటర్లు నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉంచడంతో అవి మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మదనపల్లె, రాయచోటిలోని భూసార పరీక్ష కేంద్రాలు నాలుగేళ్లుగా మూతపడిపోయాయి.

నాలుగేళ్లుగా రైతులకు అవస్థలు

వ్యవసాయంలో ప్రధానమైన తంతు భూసార పరీక్షలు. భూమిలో స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పోటాషియం ఎంత నిష్పత్తిలో వున్నాయో భూసార పరీక్షల ద్వారా తెలుసుకుంటారు. అలాగే సూక్ష్మ పోషకాలైన ఐరన్, జింక్ తదితరాలు ఎంత నిష్పత్తిలో ఉంటాయో, వాటి పీహెచ్ వాల్యూ ఎంత వుందో ఈ పరీక్షల ద్వారా తెలుసుకుంటారు. పీహెచ్ వాల్యూ 7.1 వుంటే భూమి పంటల సాగుకు అనువుగా వుంటుంది. అంతే కాకుండా స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు తగిన నిష్పత్తిలో లేకుంటే ఏయే రసాయన మందులు వాడాలో భూసార పరీక్ష కేంద్రాల నిపుణులు, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు వివరిస్తారు. రైతులు అధికారుల సూచనల మేరకు వేరుశనగ, వరి, ఉద్యానపంటల సాగులో ఈ రసాయనాలు వాడి భూసార సాంద్రతను మెరుగుపరచుకుంటారు. కానీ జిల్లాలోని రెండు భూసార పరీక్ష కేంద్రాలు మూతపడటంతో రైతులు మట్టి నమూనాలను కడపలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాల్సి వస్తోంది. దీంతో వ్యయ, ప్రయాసలతో పాటు మట్టి నమూనాల ఫలితాలు రావాలంటే ఎంత లేదన్నా వారం నుంచి పదిరోజులు పడుతోంది. దీంతో పుణ్యకాలం కాస్తా ముగిసిపోయి రైతులు నష్టాల బారిన పడుతున్నారు.

ఖరీఫ్‌పై దృష్టి పెట్టిన సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో అధికారులను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అక్కడక్కడ పడిన వర్షాలతో జిల్లాలో రైతు లు వేరుశనగ విత్తనాలు విత్తుతున్నారు. భూసారం తెలియకుండానే పంట విత్తితే దిగుబడి తగ్గే ప్రమాదం వుందని గ్రహించిన అధికారులు జిల్లాలో 10,500 మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలను చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లాలోని 400 ఆర్బీకేలకు చెందిన సిబ్బంది ఒక్కొక్కరు 30 చొప్పున రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులకు పంపుతున్నారు. ఈ మట్టి నమూనాలను కడపలోని భూసార పరీక్ష కేంద్రాలను ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు ద్వారా పంపుతున్నారు.

కడపకు పోటెత్తిన నమూనాలు

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు అవుతోంది. ఈ నెల 15 తేది వరకు వేరుశనగ విత్తేందుకు అనుకూలమైన సమయం. కేవలం 10 రోజుల గడువే వుంది. ఈ క్రమంలో జిల్లాలో 10500 మట్టి నమూనాలను సేకరించి కడప భూసార పరీక్ష కేంద్రాలకు పంపుతున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 22,000 మట్టి నమూనాలను కడప భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించి రైతులకు ఫలితాలను పంపుతున్నారు. రెండు జిల్లాల నుంచి మట్టి నమూనాలు వస్తుండటంతో పరీక్షా ఫలితాలు ఆలస్యంగా వస్తున్నాయి. దీంతో వున్న 10 రోజుల గడువు కాస్తా ముగిసిపోతే రైలు వెళ్లాక టికెట్ ఇచ్చిన చందంగా రైతుల పరిస్థితి మిగిలిపోనుంది. ఏది ఏమైనా వైసీపీ ప్రభుత్వ అనాలోచిత విధానాలతో ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ రైతులు అగచాట్లు పడాల్సి వస్తోంది.

భూసార పరీక్షలను వేగవంతం చేస్తున్నాం..

జిల్లాలో భూసార పరీక్షలను వేగవంతం చేస్తున్నాం. ఇక్కడి రెండు భూసార పరీక్షా కేంద్రాలు పనిచేయకపోవడంతో కడపకు మట్టి నమూనాలు పంపుతున్నాం. దీని కోసం జిల్లాలోని రెండు భూసార పరీక్ష కేంద్రాలకు కేటాయించిన ఏఈవోలు, ఏవోలను ఆరుగురిని కడప భూసార పరీక్షా కేంద్రానికి డిప్యుటేషన్‌పై పంపాము. ఇప్పటికే మట్టి నమూనాల పరీక్షా లక్ష్యాలను 70శాతానికి చేరుకున్నాం. గడువులోగా 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేస్తున్నాము.

- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో), రాయచోటి




మూతపడిన భూసార పరీక్ష కేంద్రం





మదనపల్లె భూసార పరీక్ష కేంద్రంలో నిరుపయోగంగా పరికరాలు



నాలుగేళ్లుగా పనిలేక మరమ్మతుకు గురైన విలువైన యంత్రం

రూ.2వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల ఆక్రమణ



అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న మంత్రి

● ప్రతి సెంటు భూమిని అధికారులు స్వాధీనం చేసుకోండి
● మంత్రి మండిపల్లి ఆదేశం

సంబేపల్లె / చిన్నమండెం, జూలై 8: రాయచోటి నియోజకవర్గంలో సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల్లో అధికారం అడ్డు పెట్టుకొని రూ.2 వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం వైసీపీ నాయకులు ఆక్రమించిన ప్రభుత్వ భూములను ఆర్డీవో రంగస్వామి, తహసీల్దార్ శ్రీనివాసులతో కలిసి ఆయన పరిశీలించారు. చెక్‌డ్యాంలు కూడా పగలగొట్టి ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. వంక పోరంపోకు భూములను సైతం ఆన్‌లైన్ చేయించుకొని ఆక్రమించుకున్నట్లు తెలిపారు. వెంటనే ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ స్థలం అని బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూమిని గుర్తించి...ప్రతి సెంటు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామాంజులు, టీడీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ భూ అక్రమణలపై ఆరా

చిన్నమండెం మండలంలో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల ఆక్రమణలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హాయంలో ఆక్రమణకు గురైన భూములను భూబకాసురుల నుంచి విముక్తి కల్పించాలని రెవెనూ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ భూముల అక్రమాలపై విచారణ చేపట్టండి

రాయచోటిటౌన్, జూలై 8: రాయచోటి నియోజకవర్గంలో డీకేటీ భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన ఒక లేఖను కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గత ఐదేళ్లలో (2019-2024) గ్రామ, మండలస్థాయి నాయకులు సుమారు రూ.2000 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని, అర్హులైన వారి డీకేటీ పట్టాలు కొన్ని రద్దయ్యాయని మీకు తెలియజేస్తున్నామన్నారు. వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించిన కొందరు రెవెన్యూ అధికారులు అర్హుల డీకేటీ భూములను అనర్హులకు బదిలీ చేశారన్నారు. ఈ డీకేటీ పట్టాలను రద్దు చేసి.. అరుహైన లబ్ధిదారులకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి మండిపల్లి కలెక్టర్‌కు పంపిన లేఖలో వివరించారు.

నారా లోకేష్‌తో చమర్తి జగన్‌మోహన్‌రాజు భేటీ


నారా లోకేష్‌తో భేటీ అయిన చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూలై 8 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకులు, కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత వ్యక్తిగతంగా తమదేనని ఆయన భరోసా ఇచ్చినట్లు చమర్తి తెలిపారు. పార్లమెంట్ వ్యాప్తంగా నియోజకవర్గాల పరిధిలో కొందరు ఉన్నతాధికారుల తీరుపై మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'ఎర్రచందనం' సమాచారం ఇస్తే నగదు బహుమతి


లంకమల అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

సిద్దవటం, జూలై 8 : ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఇస్తే నగదు బహుమతిని అందజేస్తామని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌ఓ ఆదేశాల మేరకు సిద్దవటం రేంజ్‌లో మూడు రోజులుగా పలు బృందాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయన్నారు. ఒక్కో బృందంలో 8 మంది చొప్పున 40 మంది కూంబింగ్‌లో పాల్గొంటున్నారన్నారు. రాత్రి, పగలు పెట్రోలింగ్ కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించిన వివరాలు తెలిపినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, నగదు బహుమతిని అందజేస్తామని రేంజర్ తెలిపారు.

పాలకొండ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం


ఎమ్మెల్యే జయకృష్ణకుస్వాగతం పలుకుతున్న టీడీపీ, జనసేన నాయకులు

రాజంపేట, జూలై 8 : శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు రాజంపేటలో సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. రాజంపేట మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి, బీసీ నాయకులు మల్లెల సుబ్బరాయుడు ఇంటికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ మహిళా నేత రెడ్డిరాణి, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు రామా శ్రీనివాసులు, మౌలా, నాజిర్‌ఖాన్, టీడీపీ నాయకులు తుపాకుల గోపీ, ఆనంద్, గంగయ్య, రమేష్, ఈశ్వర్, బాబు, నాగరాజ, చరణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుడి పల్లకి ఉత్సవం


పల్లకి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయచోటిటౌన్, జూలై 8: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళి, వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేసి పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిపై మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కలెక్టర్

రాయచోటి టౌన్, జూలై8: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చామకూరి శ్రీధర్ సోమవారం పట్టణంలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేసి అన్నమయ్య జిల్లా రూపురేఖలు మార్చాలన్నారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఇసుక విక్రయాల్లో దళారీలకు చెల్లుచీటీ!

● : సుగవాసి బాలసుబ్రమణ్యం


ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం

సిద్దవటం, జూలై 8 : ప్రజలదరికీ ఇసుక అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ ప్రవేశపెట్టిందని, ఇకపై ఇసుక విక్రయాల్లో దళారీల ప్రమేయం ఉండదని రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. సిద్దవటం మండలం జ్యోతి గ్రామంలో సోమవారం నూతన ఇసుక రీచ్‌లను ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి సమస్య లేకుండా, అతి తక్కువ ధరకు ఇసుక అందిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో లేకుండా పోయిందని, గ్రామాల్లో ఉండే ప్రజలకు కూడా వారి సొంత అవసరాలకు కూడా ఇసుక దొరకని పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దు చేసి ఎటువంటి రుసుము లేకుండా గ్రామీణులు గృహ అవసరాలకు ఇసుక తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు మురాద్వావలీ, ఎస్‌ఐ పెద్దఓబన్న, మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ లక్ష్మీనరసయ్య, మండల ఎంపీపీ ప్రతినిధి జ్యోతి చంద్రశేఖర్, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, తెలుగుదేశంపార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీకి పూర్వ వైభవం తెస్తా..**

ఒంటిమిట్ట: మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు జరిగే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని అఖండ మెజారిటీతో గెలిపించి, పూర్వవైభవం తీసుకువస్తానని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం గంగపేరూరు, గొల్లపల్లెల్లో కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. ముందుగా ఒంటిమిట్ట కోదండరామాలయంలో ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె బొబ్బిలి రాయుడు, క్లాస్-1 ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎస్‌వి రమణ, టీడీపీ నాయకులు వీవీ రమణ, వీరాంజనేయరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనరసయ్య, ముద్దుకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాషా, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

● **ఎత్తిపోతల పథకం పరిశీలన**

ఒంటిమిట్ట చెరువుకు నీరందించే శ్రీరామ సోమశిల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. రూ.36 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని వైసీపీ నేతలు పట్టించుకోకపోవడంతో చెరువు ఎండిపోయిందని, ఈ చెరువుకు వెంటనే నీరందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

● **సమస్యల పరిష్కారం బాధ్యత అధికారులదే..**

ఒంటిమిట్ట మండల పరిషత్ సభాభవనలో జరిగిన మండల అధికారుల ఆత్మీయ సమావేశంలో సుగవాసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. ఒంటిమిట్ట మండలంలోని అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో రామచంద్ర, ఇన్‌చార్జి తహసీల్దారు అయూబ్‌ఖాన్, ఎస్‌ఐ మధుసూదన్‌రావు, ఈవోఆర్డీ రంగయ్య, స్థానిక ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సాహిని, పశుసంవర్ధకశాఖ ఏడీ ఉమాదేవి, ఎంఈవో వెంకటసుబ్బయ్య, మండలంలోని అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వీఆర్‌వోలు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

'మండిపల్లి'ఎలా గెలిచారో ప్రజలకు తెలుసు..

● ఎంపీపీ వ్యాఖ్యలపై మల్లు నరసారెడ్డి ఆగ్రహం


విలేకర్లతో మాట్లాడుతున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి

సంబేపల్లె, జూలై 8: స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి వచ్చిన వారిని అడ్డుకొని నామినేషన్ పత్రాలు చించి వేసి, ఎన్నికైన మీరు మా మంత్రిపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంత్రి మండల సమావేశానికి వస్తున్నారని తెలిసిన వెంటనే స్వాగతం పలకాల్సింది పోయి, విమర్శలు చేయడం ఎంపీపీకి మంచిది కాదన్నారు. తెలుగుదేశం పార్టీకి మహిళలంటే ఎంతో గౌరవం అని వారిని ఏ మాత్రం కించపరిచిన, అవమానించినా సహించని ముఖ్యమంత్రి, మంత్రిపై ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి నిందలు వేయడం తగదన్నారు. మండల సమావేశాలకు తప్ప గ్రామాల్లోని సమస్యల పరిష్కారంపై ఎప్పుడైనా దృష్టి పెట్టారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాని మీరు గౌరవం గూర్చి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. నీ ప్రాదేశిక నియోజక వర్గం ఓటర్లు ఏ విధంగా ఓటేశారో మీకు తెలియదా అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిమల్లు భాస్కర్‌రెడ్డి, నూరేకరాల రంగారెడ్డి, టీడీపీ ప్రచార కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, రంగారెడ్డి, యువగళం మండిపల్లి సిద్దారెడ్డి, రెడ్డిమల్లు బాబురెడ్డి, ఖాదర్‌బాషా, ఎస్టీ నాయకులు జయరాం, అఖండనాయక్, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

200 ఎకరాల ప్రభుత్వ భూమి దురాక్రమణ!

● టీడీపీ నేతల ఆరోపణ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సంబేపల్లె టీడీపీ నేతలు

సంబేపల్లె, జూలై 8: మండలంలో 200 ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించి కంచెలు వేసుకున్నారని టీడీపీ నాయకులు నాగేశ్వర్ నాయుడు, ప్రభాకర్‌నాయుడు, కోటేశ్వర్ రెడ్డి, తదితరులు ఆరోపించారు.

సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారన్నారు. ఈ భూ ములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆక్రమణకు గురైన ప్రతి ఎకరా ప్రభుత్వ భూమిని గుర్తించి, ప్రభుత్వ అవసరాలకు వాడుకోవడంతో పాటు, మిగతా భూములను పేదలకు పంచి పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌నాయుడు, శశిధర్‌రెడ్డి, శివ ప్రసాద్‌రెడ్డి, భయ్యారెడ్డి, శేఖర్‌రెడ్డి, శేఖర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, ఆలం సాబ్, రమణ, మట్లి వేణుగోపాల్ నాయుడు, మట్లి శ్రీనివాసులు నాయుడు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి : డీహెచ్‌పీఎస్


మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్

రాయచోటిటౌన్, జూలై 8: డప్పు కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డప్పు కళాకారుల పింఛన్ రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గుర్తింపు కార్డులు, డ్రస్సులు, గజ్జలు, డప్పులు లేకపోవడంతో డప్పు కళాకారులు ఉపాధికి దూరమవుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం 18 ఏళ్ల నిండిన డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను మంజూరు చేయడంతో పాటు డ్రెస్సులు, గజ్జలు, డప్పులు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమాల్లో వారి సేవలు వినియోగించుకొని తగిన పారితోషికాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కోశాధికారి సుధాకర్, నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు వీధుల్లో పేరుకుపోయిన చెత్త


రైల్వేకోడూరులో పేరుకుపోయిన చెత్త కుప్పలు

రైల్వేకోడూరు(రూరల్) జూలై 8: పట్టణంలో చెత్తకుప్పలు తొలగించకపోవడంతో పలు వీధులు కంపుకొడుతున్నాయి. ప్రధానంగా గాంధీనగర్‌లోని మాజీ సర్పంచ్ ఇంటి వెనక వారం రోజుల నుండి చెత్తచెదారం పేరుకుపోవడంతో పాదచారులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తచెదారం భారీగా పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని, దోమలు దండయాత్ర చేస్తున్నాయిని తమ బాధను వ్యక్తం చేశారు. దోమల వలన విష జ్వరాలు వ్యాపిస్తే బాధ్యత ఎవరిదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో కనీసం చెత్తకుండీ ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. కనీసం వారానికి రెండు రోజులు చెత్తను శుభ్రం చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుకుంటున్నారు.

కుంటను తలపిస్తున్న ప్రధాన రహదారి


పుల్లంపేటలో రహదారిపై నిలచిన వర్షపునీరు

పుల్లంపేట, జూలై 8 పుల్లంపేట - చిట్వేలి రోడ్డులో పోలీసుస్టేషన్ వద్ద ప్రధాన రహదారి కుంటను తలపిస్తోంది. ఈ మార్గంలో సుమారు 30 గ్రామాలకు పైగా ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. గతంలో ఇక్కడ పడిన వర్షపునీరు పుల్లంగేరు పంట కాలువలోకి చేరేవి. వర్షపునీరు వెళ్లే కాలువ ఆక్రమణకు గురి కావడం, రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పోలీసు స్టేషన్ వరకు సిమెంటు రోడ్డు వేసి వదిలేయడంతో వర్షం పడినప్పుడల్లా నీరు రోడ్డుపై నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తుంది. వర్షం ఆగిన వారం రోజుల వరకు నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

శుక్రవారం రాత్రి రోడ్డుపై వర్షప ునీరు నిలిచి పోయింది. అధికారులు స్పందించి ఈ రోడ్డుపై వర్షపునీరు నిల్వకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ టోర్నమెంట్


విజయం సాధించిన మంటపంపల్లె జట్టు

నందలూరు, జూలై 8: నందలూరు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్‌లో భాగంగా మండలంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో సీతాపురం జట్టుపై మంటపంపల్లె జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సీతాపురం జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి 87 పరుగులు చేసింది. 88 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన మంటపంపల్లె జట్టు 10.2 ఓవర్లలో 4 వికెట్లను కోల్పోయి 88 పరుగులు చేసి విజయం సాధించింది. ఉదయం 11 గంటలకు జరిగిన మ్యాచ్‌లో నందలూరు అంబేడ్కర్ లెవెన్స్‌పై లక్ష్మీనారాయణజట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్ష్మీనారాయణ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. 136 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన నందలూరు అంబేడ్కర్ లెవన్స్ జట్టు 12 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 78 పరుగులు చేసి పరాజయం పాలైంది. మధ్యాహ్నం గాంధీనగర్ - ఈద్గా బాయ్స్ జట్ల మధ్య పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఈద్గా బాయ్స్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 104 పరుగులు చేసింది. అనంతరం గాంధీనగర్ జట్టు 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. దీంతో ఆర్గనైజర్లు సూపర్ ఓవర్ వేయించగా మొదట బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ జట్టు 7 పరుగులు చేయగా ఈద్గా బాయ్స్ జట్టు 8 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో ఆర్గనైజర్లు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, మున్నా, శివకోటి, రంజిత్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

తిరుమలకు మండిపల్లి అభిమానుల పాదయాత్ర


తిరుమలకు పాదయాత్ర ప్రారంభిస్తున్న మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

చిన్నమండెం, జూలై 8: తమ అభిమాన నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడంతో, పాటు అమాత్యయోగం దక్కడంతో ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిరుమలకు పాదయాత్ర చేసి మొక్కు తీర్చుకోవాలని నిర్ణయించారు. సోమవారం ఉదయం మల్లూరు వద్ద శ్రీరాముడి గుడిలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కొబ్బరికాయలు కొట్టి పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్ర పీలేరు, భాకరాపేట, తిరుపతి మీదుగా తిరుమల చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై పన్నులు రద్దు చేయాలి


ఆర్డీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న వ్యాపార వర్గాల ప్రతినిధులు

రాజంపేట టౌను, జూలై 8 : పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసి, వివిధ వ్యాపారాలు చేస్తున్న వారి నుంచి వసూలు చేస్తున్న పన్నులు రద్దు చేయాలని ఆర్డీవో మోహన్‌రావుకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు విజ్ఞప్తి చేశారు. 2014లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారని, దీని కారణంగా బ్రిడ్జి కింద ఉన్నవారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీనికి తోడు జూన్ 1వ తేదీ నుంచి పన్నులు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ పన్నులు చెల్లించడం వారికి తలకుమించిన భారమవుతుందన్నారు. ఈ విషయమై తాము విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాపారుల తరపున గోపీనాథ్, శ్రీనివాసులు, మునిబాలకృష్ణ, రమేష్, కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం మంత్రి ఆర్థిక సాయం

రాయచోటిటౌన్, జూలై 8: నియోజకవర్గ పరిధిలోని రామాపురం మండలం చిట్లూరు హరిజనవాడకు చెందిన పోశాల దర్బార్ అనారోగ్యంతో బెంగుళూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఆయన ఆ నిరుపేద కుటుంబ సభ్యులను పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి పిలిపించి ఈ మొత్తం అందించారు.

పురందేశ్వరిని కలిసిన చిట్టెం రామచంద్ర


పురందేశ్వరితో రామచంద్ర

రాయచోటిటౌన్, జూలై 8: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిని సోమవారం రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి చిట్టెం రామచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ పరిధిలో కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు చేసిన కృషిని వివరించారు. భవిష్యత్తులో రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలి


అసిస్టెంట్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

సుండుపల్లె, జూలై 8: పీలేరు డిపో నుంచి సుండుపల్లె మీదుగా రాజంపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి సుండుపల్లె మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బరాజు, జనసేన నాయకులు రామ శ్రీనివాసులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. తక్షణమే స్పందించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాతపూర్వకంగా పీలేరు డిపో మేనేజర్‌కు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం వారు రాజంపేట ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

అతిసార వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

ఓబులవారిపల్లె, జూలై 8 : మండలంలోని ముక్కావారిపల్లె ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అతిసార వ్యాధిపై డాక్టర్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. వ్యాధి నివారణకు పాటించాల్సిన పద్ధతులు, నివారణ చర్యలను తెలిపారు. చేతులు సబ్బుతో కడుక్కోవడం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

వీరబల్లి, జూలై 8: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి సూచించారు. సోమవారం వీరబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. నేర రహిత సమాజం కోసం ప్రతి విద్యార్థి, పౌరుడు కృషి చేయాలన్నారు. ప్రాథమిక హక్కులకు ఆటంకం కలిగితే ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకోవాలని యువన్యాయవాది సుంకు రవీంద్ర తెలియజేశారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, గృహ హింసపై ప్రతి విద్యార్థి న్యాయ పోరాటం చేయవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగు ఆవశ్యకతపై సూచనలు


పశుగ్రాసం ఆవశ్యకతను రైతులకు వివరిస్తున్న పశువైద్యాధికారులు

చిన్నమండెం, జూలై 8: పశుగ్రాస ఉత్సవాల సందర్భంగా మండలంలోని పడమటి కోన గ్రామ పంచాయతీలో పశుగ్రాసం సాగు, ఆవశ్యకతపై సోమవారం డివిజనల్ ఉప సంచాలకులు, పశుసంవర్ధక శాఖ డాక్టర్ మాల కొండయ్య, టెక్నికల్ డాక్టర్ రవి కుమార్, స్థానిక పశువైద్య అధికారి గణేశ్ సమావేశం నిర్వహించారు. రైతులకు పశుగ్రాసం సాగుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాం మోహన్‌రెడ్డి అనే రైతుకు చెందిన పొలంలో సాగు చేసి హైబ్రీడ్ సూపర్ నేపియర్ గడ్డిని పరిశీలించారు. గ్రామంలోని రైతులందరితో సమావేశ మై మొక్క జొన్న, జొన్న రకం పశుగ్రాస విత్తనాలను ప్రభుత్వం 75 శాతం రాయితీతో సరఫరా చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవిలో గడ్డిని నిల్వ చేసుకునే విధానంపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్ర మంలో రైతులతో పాటు పశు సహాయ సంచాలకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్వేలి: పశుగ్రాసం వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఏపీహెచ్ చిట్వేలి పరిధిలోని ఏహెచ్‌ఏలు కెకెవడ్డిపల్లెలో సాగు చేస్తున్న వివిధ రకాల పశుగ్రాసాలను చూపించి వాటిపై అవగాహన కల్పించారు. కెకె వడ్డిపల్లెలో ప్రగతిశీల పాడిరైతు పెంచలయ్య పశుగ్రాసాల సాగులో అనుసరించే పద్ధతులను వివరించారు. పెనగలూరు, చిట్వేలి పశువైద్యులు వేదవతి, భువనేశ్వరి, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి సుగవాసి సంతాపం


జయరాములు భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

గాలివీడు, జూలై 8: టీడీపీ సీనియర్ నాయకుడు, ఏటిగడ్డ గంగమ్మ ఆలయ ధర్మకర్త జయరాం ఆకస్మిక మృతి బాధాకరమని రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. గాలివీడుకు చెందిన జయరాములు తన స్వగృహంలో ఆకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన విషయాన్ని తెలుసుకున్న వారు సోమవారం ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మానవ తప్పిదాలతో ప్రాణాలు కోల్పోరాదు

పరిశ్రమల భద్రతా కమిటీ సమావేశంలో కడప జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్) జూలై 8: చిన్న పాటి మానవ తప్పిదాలతో పరిశ్రమల్లో ఏ ఒక్క కార్మికుడి ప్రాణాలూ కోల్పోకూడదని, పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను పటిష్టం చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మికశాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్ని మాపక శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా చర్యలను పర్యవేక్షించాలన్నారు. రెడ్ క్యాటగిరీలో ఉన్న పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రత కల్పించేందకు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్, ప్రొటో కాల్ చర్యలను ఖచ్చితంగా పాటించాలన్నారు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేటలో అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో తాజాగా జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఫ్యాక్టరీల్లో చిన్న పాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు కారణం కావచ్చని క్రైసిస్ గ్రూప్ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు రెవెన్యూ, ఫైర్ శాఖలు సమన్వయంతో మాక్ డ్రిల్ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో, ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణ సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ కృష్ణమూర్తి, సంబంధిత అధికారులు, సాక్ జడ్ఎం శ్రీనివాస మూర్తి, జీఎం జయలక్ష్మీ, ఫైర్ అధికారి ధర్మరావు, ఇండియా, భారతి, దాల్మియా, జువారీ సిమెంట్స్ తదితర పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

'రాజోలిని' జిల్లా పరిధిలోకి మార్చాలి

- మంత్రికి ఎమ్మెల్యేల వినతి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యేలు

మైదుకూరు, జూలై 8: రాజోలి రిజర్వాయర్‌ను నంద్యాల జిల్లా నుంచి కడప జిల్లాకు మార్చాలని జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయంలో ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా చైతన్యరెడ్డి, కడప పార్లమెంట్ అభ్యర్థి చదిపిరాల భూపేష్‌రెడ్డి మంత్రి రామానాయుడును కలసి రాజోలి రిజర్వాయర్‌ను త్వరగా నిర్మిస్తే కేసీ కాల్వ, తెలుగుగంగ ప్రాజక్టు ద్వారా లక్షలాది మంది రైతులకు సాగు నీరు అందుతుందన్నారు. దీంతో ఏడాదికి పుష్కలంగా రెండు లేదా మూడు పంటలు వేసుకోవచ్చని, రైతుల కోసం రాజోలి రిజర్వాయర్ త్వరితగతిన నిర్మించేందుకు నంద్యాల జిల్లా నుంచి కడప జిల్లాకు మార్చాలని కోరుతూ వినతి పత్రంను మంత్రికి అందించారు. కాగా రాజోలి నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డికి కూడా శంఖుస్థాపనలు చేసి మిన్నకుండిపోయిన విషయం తెలిసిందే. కాగా టీడీపీ ప్రభుత్వంలో రాజోలి నిర్మాణం జరిగితే రైతులకు టీడీపీ ప్రభుత్వం ఎంతో మేలు చేసినట్లవుతుంది.

ప్రమాదకరంగా గండికోట స్లూయిస్ గేట్లు

మెయింటెనెన్స్ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

నివేదిక కోరిన టీడీపీ ప్రభుత్వం



గండికోట ప్రాజెక్టు

కొండాపురం, జూలై 8: గండికోట ప్రాజెక్టు స్లూయిస్ గేట్లు ప్రమాదకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు మెయింటెనెన్స్ పనులు చేపట్టకపోవడంతో స్లూయిస్ గేట్లు మరమత్తులకు నోచుకోలేదు. దీంతో వారం రోజుల కిందట మైలవరం జలాశయానికి నీరు వదిలే సమయంలో గేట్లు తెరుచుకోక పోవడంతో అధికారులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. స్లూయిస్ గేట్ల రోప్ దెబ్బతినడంతో గేట్లు మొరాయించినట్లు తెలుస్తోంది. అయితే తాత్కలికంగా వీటిని సరిచేసి మైలవరం జలాశయానికి నీరు వదులుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మెయింటెనెన్స్ పనులకు టెండర్లు పిలిచినా ఎవరూ పనులు చేయడానికి ముందుకు రాలేదు. దీంతో మరమత్తులకు నోచుకోలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక అత్యవసరంగా మెయింటెనెన్స్ గురించి అడిగిందని, దీనికి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపుతునున్నట్లు డీఈ ఊమామహేశ్వర్లు తెలిపారు. ఎక్కువ రోజులు గేట్ల రోప్ నీటిలో నానడం వల్ల దెబ్బతినిందని డీఈ తెలిపారు. అయితే ఇప్పటికిప్పుడు ప్రమాదమేమీ లేదని, ప్రస్తుతం గండికోట నుంచి మైలవరం జలాశయానికి 400 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు డీఈ తెలిపారు.

అనుమతి లేని మందులను విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 8: ఎరువుల దుకాణాల్లో ప్రభుత్వ అనుమతి లేని పురుగుల మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కేఎంవీ ప్రసాద్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణంలో మూడు ఎరువుల నమూనాలు, భారత్ సీడ్స్ దుకాణంలో రెండు విత్తన నమూనాలను సేకరించి పరీక్షకోసం ల్యాబ్‌కు పంపారు. రికార్డులు సరిగాలేని రూ.1,17,855 విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. తిరుమల సీడ్స్‌లో రికార్డులు సక్రమంగా నిర్వహించని రూ.17,440 మందుల విక్రయం చేయరాదని ఆదేశించారు. అధిక ధరలకు పురుగుల మందులు విక్రయించినా, అనుమతులు లేని ఎరువులు విక్రయించినా దుకాణ దారులపై చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, మందులు కొనే ప్రతి రైతుకూ బిల్లు చెల్లించాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ ఈదురుబాష, వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం ఏఓ గోవర్ధన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సురేష్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ - ముగ్గురికి గాయాలు

పెండ్లిమర్రి, జూలై 8: సవాస్కాన్‌పల్లెలో ఇరువర్గాలమధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు గ్రామంలో కోలాటం జరుగుతుండగా మాటా మాటా పెరిగి ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. గతంలో కూడా ఇరువర్గాల మధ్య విబేధాలు ఉండేవి. వీరిలో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఒకవర్గానికి చెందిన నరసింహారెడ్డి ఫిర్యాదుపై ఏడుగురిపై, మరోవర్గానికి చెందిన నాగార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు 16మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు. పోలీసులు ఉండగానే ఇరువర్గాలు ఘర్షణ పడడం మండలంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

బద్వేలులో ఆగని భూ వివాదాలు

అసలు ఇంటి పట్టాలు కొందరి వద్ద..

మరికొందరి వద్ద నకిలీ పట్టాలు

ఆందోళనలో అసలు లబ్ధిదారులు

బద్వేలు రూరల్, జూలై 8: బద్వేలు పట్టణం నానాటికీ విస్తరిస్తోంది. చుట్టూ గ్రామీణ ప్రాంత ప్రజలు తమ పిల్లల చదువుల కోసం, వృత్తి వ్యాపారాల రీత్యా పట్టణానికి వచ్చి చేరుతున్నారు. దీంతో స్థలాల ధరలకు రెక్కలొచ్చి ప్రభుత్వ డీకేటీ స్థలాలు కూడా లక్షలాది రూపాయలు పలుకుతున్నాయి. ఈ క్రమంలోనే నకిలీ పట్టాల ముఠా తయారై డీకేటీ పట్టాలకు నకిలీ పట్టాలు తయారు చేసి, విక్రయించి భూవివాదాలకు తెరలేపారు. అయితే బద్వేలు రెవెన్యూ డివిజను అయిన తరువాత మొదటి ఆర్డీఓ ఆకుల వెంకటరమణ నకిలీ పట్టాలపై ఉక్కుపాదం మోపి నకిలీ పట్టాలు తయారు చేసే ముఠాను మరికొందరిని దోషులుగా గుర్తించి జైలుకు పంపారు. కొంతకాలం భూవివాదాలు సద్దుమనిగినా ఇటీవల మళ్లీ తెరపైకి వచ్చాయి. దీంతో అసలైన లబ్ధిదారులకు, నకిలీ పట్టాలున్న లబ్ధిదారుల నడుమ వివాదాలు సాగుతూ అసలైన పట్టాదారులు ఆందోళనకు గురవుతున్నారు.

నకిలీ పట్టాలు ఇంకా ఉన్నాయా ?

బద్వేలు రెవెన్యూ డివిజన్ అయిన తరువాత మొట్టమొదటి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఆకుల వెంకటరమణ నకిలీ పట్టాలపై దృష్టి సారించి నకిలీ పట్టాల గుట్టు రట్టు చేశారు. కొంత మందిని నకిలీ పట్టాల దోషులుగా గుర్తించి జైలుకు పంపడంతో కొంత కాలం భూవివాదాలు సద్దుమనిగాయి.

ఇటీవల మొదలైన భూవివాదాలు

మొదట తలెత్తిన భూవివాదాలు కొందరు అధికారుల చర్యలతో సద్దుమనిగినా ఇటీవల మళ్లీ పడగ విప్పేందుకు సిదమవుతున్నాయి. డీకేటీ పట్టాలు



వివాదాలు తలెత్తిన మహ్మద్ కాలనీలో ఓ ప్రాంతం

ఎక్కువగా ఉన్న సుందరయ్యకాలనీ, మహ్మద్ కాలనీ, మార్తోమానగర్, ఐలమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థలం తమదేనంటూ రెండు వర్గాలు వాదనలకు దిగుతుండడంతో అసలు పట్టాదారుడు ఎవరు? నకిలీ పట్టాదారుడు ఎవరో గుర్తించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. భూవివాదాలు మళ్లీ మొదటికి వచ్చేసరికి అసలైన లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రెవెన్యూ శాఖలో రికార్డులు మాయం

డీకేటీ పట్టాలు ఎక్కువగా ఉన్న గోపవరం మండల రెవెన్యూ కార్యాలయంలో కొన్ని రికార్డులు మాయమైనట్లు సమాచారం. రికార్డులు మాయం చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన వారు ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహించడంలేదు. రికార్డులు మాయమైన స్థానే నకిలీ పట్టాలు తయారయ్యాయి. దీంతో అసలైన లబ్ధిదారుడు ఎవరో గుర్తించలేని స్థితిలో రెవెన్యూ అధికారులున్నారు. అసలైన లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లినా రికార్డులు లేవని బాధితులకు రెవెన్యూ అధికారులు చెబుతుండడం గమనార్హం.

పంచాయితీ పెద్దమనుషులు

పట్టణంలో నెలకొన్న భూవివాదాలు పరిష్కరించేందుకు పట్టణంలో దాదాపు ఓ ఐదారు బ్యాచ్‌లున్నాయి. భూ వివాదం ఏర్పడిన వెంటనే సమాచారం తెలుసుకుని అసలైన లబ్ధిదారులు పెద్దమనుషుల పంచాయతీ వద్దకు వెళుతున్నారు. అయితే రెవెన్యూ అధికారులు జున్యైన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోడం వల్ల బాధితులు పెద్ద మనుషుల మధ్య పంచాయతీ చేసుకునేందుకు సిద్దమవుతున్నారు. పెద్దమనుషుల వద్ద పంచాయతీలో అసలైన లబ్ధిదారులకు, నకిలీ పట్టా కలిగిన వారికి ఇద్దరిలో ఒకరికి లాభాన్ని చేకూర్చి తాము కొంత సొమ్మును వెనకేసుకుంటూ పంచాయతీలు నడుపుతున్నారు.

ఇప్పటికైనా పరిష్కారమవుతాయా

పట్టణంలో పదేళ్లగా భూవివాదాలు మొదలయ్యాయి. ఎంత మంది అధికారులు మారుతున్నా భూవివాదాలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. రికార్డుల ప్రకారం అసలైన లబ్ధిదారుని గుర్తించే వీలు లేకపోవడమే సమస్యగా తయారైనట్లు బాధితులు వాపోతున్నారు. అసలైన లబ్ధిదారుడిని గుర్తిస్తే సమస్యే లేదు కదా అన్న వాదనలు ప్రజల నుంచి మేధావి వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా బద్వేలులో భూ వివాదాలు జరుగుతున్నా ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమని పలువురు వివరిస్తున్నారు.

వివాదాలు ఉన్నాయి

పట్టణంలోని గోపవరం ప్రాంతానికి చెందిన డీకేటీ ఇంటిస్థలాలపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సమస్యలు పరిష్కరించేందుకు రికార్డులు అందుబాటులో లేవు. గతంలో నమోదైన నకిలీ పట్టాల కేసుకు సంబంధించి కొన్ని రికార్డులు ఉన్నతాధికారుల వద్ద ఉండగా మరికొన్ని రికార్డులు లేవు. దీంతో సమస్యను పరిష్కరించ లేకున్నాం. డీకేటీలను కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమైనా ఈ ప్రాంతంలో అమ్మకాలు కొనసాగడం విడ్డూరం. త్వరలోనే ఈ సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతాం.

\- ఎం.రోశయ్య, గోపవరం తహసీల్దారు

పదవి ఊడినా.. స్టిక్కర్...

ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్న వైసీపీ నేతల కార్లు



తాజా మాజీ ఎమ్మెల్యే కారుకు అలానే ఉన్న ప్రభుత్వ విప్ స్టిక్కర్

రైల్వేకోడూరు, జూలై 8: తాజా మాజీ ఎమ్మెల్యేకి పదవి పోయినా గతంలో ఆయనకు ప్రభుత్వం కేటాయించిన స్టిక్కర్ మాత్రం ఊడలేదు. నెంబరు ప్లేట్‌కు ప్రభుత్వ విప్ అంటూ స్టిక్కర్‌ను తొలగించలేకున్నారు. ఆయనతో పాటు చాలా వైసీపీ నేతల కార్లకు ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్నారు. సోమవారం రైల్వేకోడూరు టోల్గేట్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా పూలమాలలు వేయడానికి తాజా మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వచ్చారు. తన ఓల్వో కారుకు ముందు వెనుక ప్రభుత్వ విప్ స్టిక్కర్ ఉంది. ఎన్నికలు అయిపోయాయి, వైసీపీ కోడూరులో ఓడిపోయింది. జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యే గెలిచారు. అయినా తాను మాజీ ఎమ్మెల్యే అనుకోకుండా ఊహల్లో ఉండి కారుకు ఉన్న స్టిక్కర్‌ను తొలగించకుండా తాజా మాజీ ఎమ్మెల్యే తిరుగుతుండడం పట్ల కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన అనుచరులకు ఉన్న కార్లకు కూడా ఎమ్మెల్యే స్టిక్కర్లు ఉన్నాయి. కొందరు హుందాగా తీసివేసినా తాజా మాజీ మాత్రం తొలగించకుండా అట్లే పెట్టుకున్నారు. దీంతో సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



వైసీపీ నేతల కార్లకు తొలగించని ఎమ్మెల్యే స్టిక్కర్లు

మంత్రి మండిపల్లిని కలిసిన ఆసియా ఒలింపిక్ చాంపియన్ శ్రీలక్ష్మి



శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై8: ఆసియా ఒలింపిక్ చాంపియన్ శ్రీలక్ష్మి సోమవారం ఎస్ఎన్‌కాలనీలోని కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొనేలా క్రీడలను అభివృద్ధి చేయాలని ఆమె మంత్రిని కోరారు. తను సాధించిన మెడల్స్ గురించి ఆయనకు వివరించారు.

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



సీసీ పుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు, బాధితులు

ముద్దనూరు జూలై8: మండలంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. 10 రోజల నుంచి తాళం వేసిన ఇళ్లు, దుకాణాలు లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాలను సైతం లెక్క చేయకుండా చాకచక్యంగా చోరీ చేస్తూ దొరికినంత దోచుకెళుతున్నారు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. స్థానికుల సమాచారంతో వివరాల్లోకెళితే....

ఆదివారం రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీలు జరిగాయి. నాలుగు రోడ్ల కూడలిలోని ఐరన్ దుకాణం, పెయింట్ దుకాణంలో చోరీలు జరిగాయి. క్యాష్ బాక్స్ పగులగొట్టి నగదు చోరీ చేశారు. ఒక దుకాణంలో దాదాపు రూ.15వేలు నగదు మొబైల్, మరో దుకాణంలో రూ.4వేలు నగదు, దేవుడి హుండీ చోరీ చేయగా పాత బస్టాండులోని గుడ్లు, టీ దుకాణం బీగాలు పగుల గొట్టినట్లు తెలిసింది. అయితే వారం రోజుల కిందట నాలుగు రోడ్ల కూడలిలోని పాల కేంద్రంలో చోరీకి పాల్పడ్డారు. నల్లబల్లె గ్రామ సమీపంలోని మూత పడిన పాత మిషన్ వద్ద మోటార్లు చోరీ జరిగాయి. అంతేకాకుండా చిన్నదుద్యాల గ్రామ సమీపంలోని మూతపడిన తార మిక్సింగ్ ప్లాంట్ వద్ద మోటార్లు చోరీకి గురవడంతో యజమాని ఏమంటాడోనని కాపాలాదారుడు ఓబులేసు ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. చోరీకి సంబంధించి బాధితులు సీసీ పుటేజీ సహా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కొన్నింటిపై మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారని బాధితుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ఎట్టకేలకు లొంగిపోయిన నిందితులు.. రిమాండు

కడప (క్రైం) జూలై 8: కడప టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐ భాస్కర్ (ఏఎస్ఐ-246) అతని సోదరుడు, ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ విజయకుమార్ (ఎఆర్ హెచ్‌సీ - 1801)లను సస్పెండ్ చేస్తూ కర్నూలు డీఐజీ సీహెచ్ విజయరావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన దాడి ఘటనలో నిందితులుగా ఉన్నారు. వీరితో పాటు ఉన్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సదరు కేసులో నిందితులుగా ఉన్న వీరు పరారీ అయ్యారు. రెండురోజుల కిందట కోర్టులో లొంగిపోయారు. మెజిస్ట్రేట్ వారిని రిమాండుకు ఆదేశించారు. వీరి వ్యవహారంపై నిఘా విభాగం ఎస్పీ సిద్దార్ధ కౌశల్‌కు నివేదిక ఇచ్చారు. దీంతో ఎస్పీ వీరి ప్రవర్తనపై పోలీసుశాఖ పరంగా సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తూ కర్నూలు- కడప రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావుకు ప్రతిపాదనలు పంపించారు. వీరిని పోలీసులు పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. విజయకుమార్ గత నెలలో నిర్దేశించిన విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో అధికారిపై దుర్భాషలాడడంతో చర్యలకు సిఫారసు చేశారు.

ఎర్రచందనం కేసులో వారెంట్

మైదుకూరు, జూలై 8: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో కడప వాసి షేక్ ఖాదర్‌బాషపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు మైదుకూరు పోలీసులు తెలిపారు. కడప నకాష్ వీధి వాసి షేక్ ఖాదర్‌బాషపై 2016లో మైదుకూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. వెంటనే తిరుపతి జిల్లా కోర్టులో లేదా మైదుకూరు స్టేషన్‌లో హాజరవాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ మస్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

టెట్ షెడ్యూలులో మార్పు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 8: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూలులో ప్రభుత్వం మార్పులు చేసింది. జూలై 2న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు5 నుంచి 20 వరకు టెట్ జరగాల్సి ఉండగా అక్టోబరు 3 నుంచి 20 వరకు నిర్వహిస్తామని తెలిపింది.

కొత్త షెడ్యూలు ఇలా...

- పరీక్ష ఫీజు చెల్లింపు ప్రారంభం కాగా ఆగస్టు 3 వరకు అవకాశం ఉంది.
- ఆగస్టు 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
- సెప్టెంబరు 19 నుంచి ఆన్‌లైన్ మాక్‌టెస్ట్
- అక్టోబరు 3 నుంచి 20 వరకు రెండు సెషన్స్‌లలో పరీక్షలు నిర్వహిస్తారు.
- అక్టోబరు 4న ప్రొవిజనల్ కీ విడుదల
- అక్టోబరు 5 నుంచి కీపై అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబరు 27న తుదికీ విడుదల
- నవంబరు 2న ఫలితాలు విడుదల

చికిత్స పొందుతూ మహిళ మృతి

సికెదిన్నె, జూలై 8: భర్త చేతిలో గాయపడిన లక్ష్మీదేవి (48) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. పాపాసాహెబ్‌పేట వాసులు వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు తరచూ గొడవపడేవారు. ఆదివారం అదే విధంగా గొడవ పడి కోపంతో రోకలిబడెతో భార్య తలపై కొట్టాడు. దీంతో ఆమె అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆమె మరణించినట్లు తెలిపారు. కుమారుడు హేమంత్ ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్) జూలై8: అన్నమయ్య జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా పరిశ్రమల అధికారులను అదేశించారు. సోమవారం కలెకర్ చాంబర్‌లో జిల్లాలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమల గురించి, భూ సేకరణపై రాయచోటి, మదనపల్లి, రాజంపేట, ఆర్డీఓలు, జిల్లా పరిశ్రమల శాఖ సమీక్షించారు. పరిశ్రమల అధికారి మాట్లాడుతూ రాయచోటి మండలం శిబ్యాలలో దాదాపు 300 ఎకరాలు పారిశ్రమిక పార్క్‌కు సిద్ధం చేశామన్నారు. మదనపల్లి దగ్గర ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు నివేదికలు తయారు చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు చాలా ముఖ్యమని, ఆర్థిక అభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు వుండాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక పార్క్‌లకు నివేదికలు సిద్ధం చేయలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, అర్‌డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపుపై కేసు నమోదు

పోరుమామిళ్ల, జూలై 8: క్వారీలో ఉండాల్సిన ఇసుకను దొంగతనంగా తరలించినందుకు నాగేంద్ర అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న ఇసుక క్వారీలో ఆదివారం రాత్రి నాగేంద్ర అతని అనుచరులు ట్రాక్టరుతో ఇసుక తీసకెళ్లడంతో దీనిపై విచారణ జరిపి వీఆర్వో రామలక్షుమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

8 మంది జూదరుల అరెస్టు

వీరబల్లి, జూలై8: ఓదివీడు పంచాయతీ కావలిపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.49,500లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ సేల్స్ చేయకూడదు



రికార్డులను పరిశీలిస్తున్న ప్రసాద్‌రెడ్డి

ఖాజీపేట, జూలై 8: అనుమతి లేకుండా ఆన్‌లైన్ సేల్స్ చేయకూడదని తిరుపతి ఎస్‌డీఎల్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖాజీపేటలోని ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ దుకాణాలను తనిఖీ చేశారు. అయితే ఒక్క దుకాణంపై మాత్రమే తనిఖీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. అదీకూడా నామమాత్రంగా తనిఖీ చేయడం గమనార్హం. మాట్లాడుతూ అమ్మకం ధృవీకరణ పత్రం లేకుండా ఎటువంటి అమ్మకాలు చేయరాదని, ఇష్టానుసారంగా చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగార్జున, టెక్నికల్ ఏఓ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీ తొలగింపుపై ఘర్షణ


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న సీఐ మధు, ఎస్ఐ శివకుమార్

తంబళ్లపల్లె, జూలై 8: టీడీపీ నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీని వైసీపీ నాయకులు తొలగించడంతో సోమవారం తంబళ్లపల్లె మండల కేంద్రంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తంబళ్లపల్లె మండల కేంద్రంలో వైఎస్సార్ కూడలిలో సోమవారం వైసీపీ నాయకులు వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆ చుట్టు పక్కల వైసీపీ జెండాలు కట్టారు. ఈ క్రమంలో వైసీపీ జెండా ఆవిష్కరించాలనే కారణంతో జెండా స్తంభం పక్కనే ఇటీవల స్థానిక టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీని వైసీపీ నాయకులు తొలగించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని తమ బ్యానర్ ఎలా తొలగిస్తారని వైసీపీ నాయకులతో ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుక్ను ఎస్ఐ శివకుమార్ అక్కడికి చేరుకోగా తమ బ్యానర్‌ను వైసీపీ వారు కావాలనే తీసివేశారని, తిరిగి మళ్లీ వారే కట్టాలంటూ టీడీపీ నాయకులు పట్టుబట్టారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిసితులు నెలకొనగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ఎస్ఐ వైసీపీ నాయకులను అక్కడి నుంచి పంపించివేశారు. కాగా ములకలచెరువు సీఐ మధు అక్కడికిరాగా టీడీపీ ఫ్లెక్సీని తొలగించిన వైసీపీ నా యకులు అదే స్థానంలో తిరిగి ఫ్లెక్సీని ఏర్పాటు చేయించేలా చూడాలని కోరారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి టీడీపీ ఫ్లెక్సీని తొలగించిన వైసీపీ నాయకులపై కఠినచర్యలు తీసుకోవాలని తంబళ్లపల్లె ఎస్ఐ శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు.

చేపల వాటాల కోసం రెండువర్గాల మధ్య ఘర్షణ

నిమ్మనపల్లి, జూలై 8: మండలంలోనిబాహుదా ప్రాజక్టు, వాటికి సంబందించిన ఎనిమిది చెరులలో చేపల వాటాలలో సఖ్యత కోసం సోమవారం రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పైగా సోమవారం వారపుసంత కావడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. ఈఘర్షనలో ఇద్దరు వ్యక్తుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. అక్కడ ఏంజరుగుతోందోనంటూ ప్రజలు చర్చించుకోసాగారు. దీంతో మాజీ మండల అధ్యక్షుడు రాజన్న, మాజీ యువత అధ్యక్షుడు శ్రీపతి ఇద్దరు మరో వర్గానికి చెందిన శంకర, చెంద్రాయుడులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ లోకేశౌరెడ్డి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా దాదాపు 15రోజులుగా నిత్యం ఇసుకను బాహుదా కాలువల్లో ఎక్స్‌కవేటర్లతో తోడి టిప్పర్ల సహాయంతో మదనపల్లి, తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారంటూ ఇరువర్గాలు గొడవకు దిగిన ఘటన చోటుచేసుకుంది.

కొడుకుకు శిక్ష పడుతుందని తండ్రి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం జూలై 8 : కన్న కొడుకుకి శిక్ష పడుతుందని ఓ తండ్రి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన పీటీఎం మండలంలోని కందుకూరులో చోటుచేసుకుంది. పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన కొత్తపల్లె రమణ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించేవాడు. తన కొడుకు నరసింహులు ఓ బాలికను ప్రేమించి గర్భవతిని చేశాడు. ఈ విషయంపై పీటీఎం పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నరసింహులును జైలుకు పంపించారు. అనంతరం కుమారుడు కేసు నుంచి బయట పడడానికి తండ్రి రాజీ యత్నాలు ప్రారంభించాడు. కాగా అమ్మాయి తండ్రి కేసు నుంచి రాజీకి రావడానికి రూ 5 లక్షలతో పాటు తాము కాపురముంటున్న ఇంటిని ఇస్తే రాజీకి వస్తానంటూ ప్రతిపాదనలు పెట్టడంతో మానసికంగా కుంగిపోయిన కొత్తపల్లె రమణ సోమవారం ఉదయం కందుకూరు గ్రామ సమీపంలో ఉరివేసుకుని మృతి చెందాడు. ఈవిషయంపై ఆయన కొడుకు నరసింహులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో వ్యక్తికి జైలు శిక్ష

పీలేరు, జూలై 8: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డ ఓ నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష పడినట్లు పీలేరు ఎఫ్ఆర్‌వో రామ్లా నాయక్ తెలిపారు. కేవీపల్లె మండలం జిల్లేళ్లమంద పంచాయతీ పాలెంగడ్డ గ్రామానికి చెందిన ముప్పే ప్రసాద్ (42) 2013 జూలై21 వతేదీన ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పీలేరు మండలం మేళ్లచెరువు బీటు, బొంతకనుమ సమీపంలోని బోడిగుట్ట సమీపంలో పట్టుబడ్డాడన్నారు. అప్పటి నుంచి ఆ కేసు పీలేరులోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆ తరువాత తిరుపతిలో ఏర్పాటు చేసిన ఎర్రచందనం స్పెషల్ కోర్టులో నడిచిందన్నారు. ఈ నేపథ్యంలో ఈఏడాది జూన్ 28న తిరుపతి కోర్టు ప్రసాద్‌కు మూడు నెలల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించిందన్నారు. అయితే కోర్టు నుంచి రికార్డులు సోమవారం తమకు అందడంతో ఆ వివరాలు వెల్లడిస్తున్నామన్నారు. 2013 నుంచి కేసును సక్రమంగా నడిపిన పీలేరు ఎఫ్ఆర్‌వోను డీఎఫ్‌వో అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

పీలేరు, జూలై 8: పీలేరులోని ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల దుకాణాలలో వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర విజిలెన్స్ బృంద సహాయ సంచాలకులు(కర్నూలు) సాలురెడ్డి, ఎస్ఐ రామకృష్ణ నాయక్, డీఏవో కార్యాలయ అధికారి మోహన్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు దుకాణదారులతో మాట్లాడుతూ ఎరువులు ఎంఆర్‌పీకే అమ్మాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవోలు రమాదేవి, నవీన్, ఏఈవో నజీర్ పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలు నిలిపివేత

కలికిరి, జూలై 8: పట్టణంలోని సిరి అగ్రో మార్ట్ దుకాణంలో 19 టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేస్తూ విజిలెన్స్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విజిలెన్స్ శాఖకు చెందిన కర్నూలు ఏడీఏ ఎన్. సాలు రెడ్డి, తిరుపతి విజిలెన్స్ ఎస్ఐ ఎం.రామకృష్ణ నాయక్‌లు సోమవారం పట్టణంలోని సిరి అగ్రో మార్ట్‌లో తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగుల మందు విక్రయాలను సరిచూశారు. ఇందులో రికార్డుల పరంగా తేడా ఉన్న కారణంగా 18.92 టన్నుల ఎరువులు విక్రయాలు జరపకుండా నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో ఏవోలు వెంకట మోహన్, మమతా రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై8: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి నిందితులను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. మదనపల్లె మండలం పోతబోలు గ్రామం కురువపల్లెకు చెందిన ఎం. గోవిందు (67), సీటీఎం క్రాస్ పంచాయతీ, మిట్టపల్లెకు చెందిన చంద్రప్పను గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో వెళ్లి సీఐ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.రూ. 14,500 విలువ చేసే 750 గ్రాములు గంజాయిని తాలుకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి


విద్యార్థినులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, జూలై 8: ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో పలు స్కూళ్లను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు చేశారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న గుణాత్మక శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ విద్యార్థులపై 28 విధాల నిఘా ఉంచి వారిలో మార్పు తీసుకొచ్చే బాధ్యత టీచర్లదేనన్నారు. ఈ స్థాయిలో మార్పు వలన సమాజంలో విద్యార్థులు ఉన్నతులుగా ఎదుగుతారని గుర్తు చేశారు. అనంతరం క్లాస్ రూములను పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేయడానికి డైనింగ్ హాల్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. బాలాజీనగర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల్లో నిర్వహించిన విద్యాసామాగ్రి కిట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించాలని సూచించారు. రిటైర్డు ఉపాధ్యాయులను పూలమాలతో దుశ్శాలువ కప్పి సన్మానించారు. స్థానిక నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేఅవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఉత్తమఫలితాలను సాధించినందులకు హెచ్ఎం రాజేంద్రబాబును, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. అలాగే దేవతా నగర్‌లో ఎంపీ ఆనందన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్య ఆశ్రమంలోని విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్ బ్యాగ్‌లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు బెంగళూరు రోడ్డులోని జీఆర్టీ హైస్కూల్‌లో విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎంలు సుబ్బారెడ్డి, రాజేంద్రబాబు, టీడీపీ నాయకులు నాదేళ్ల శివన్న, షంషీర్, స్వరూప్, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, నాగయ్య, బొమ్మిశెట్టి పురుషోత్తం, కమలమరికృష్ణ, జ్ఞానోదయ ప్రసాద్, సురేంద్రరెడ్డి, జేసీబీ మధు, మోడెం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలు

● ఆందోళనలో ప్రజలు, వాహనదారులు

గుర్రంకొండ, జూలై 8:గుర్రంకొండ పట్టణంలో ద్విచక్ర వాహనాల చోరీలు రోజురోజుకు పెరుగుతుండడంతో పట్టణ ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి పూట ఇళ్ల ముందు ఉంచిన ద్విచక్ర వాహనాలను దుండగులు చోరీ చేస్తున్నారు. ఇందులో కొత్త వాటినే దొంగలించడం జరుగుతుంది. పట్టణంలో పది రోజుల్లో మూడు ద్విచక్ర వాహనాలను దుండగులు చోరీ చేశారు. గుర్రంకొండ పట్టణంలోని బజారువీధి, తాళంవీధి, కొత్తపేట, దావూద్‌వీధిలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురౌతున్నాయి. ఇందులో భాగంగా బజారువీధికి చెందిన కలేషామస్తాన్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని గత నెల 28న రాత్రి ఇంటి ముందు ఉంచి నిద్రపోయారు. ఉదయం లేచి చూడగా వాహనం కనబడలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన మరువక ముందే మూడు రోజుల క్రితం తాళంవీధి, దావూద్ వీధిలో మరో రెండు ద్విచక్ర వాహనాలను దుండగులు చోరీ చేశారు. ఇవే కాక పట్టణంలో చాలా పాత ద్విచక్ర వాహనాలు చోరీ అయ్యాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇళ్ల ముందు ద్విచక్ర వాహనాలను ఉంచాలంటే భయాందోళన చెందుతున్నారు. పట్టణంలో రాత్రి పూట పోలీసులు గస్తీని పెంచి వాహనాల చోరీలను అరికట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈవిషయమై ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి వివరణ కోరగా ద్విచక్ర వాహనాల చోరీపై నిఘా ఉంచినట్లు తెలిపారు. పట్టణంలో సీసీ కెమెరాలు లేని చోట్ల చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకొంటామన్నారు.

ఐటీఐ కోర్సులతో సత్వర ఉపాధి

● జాబ్‌మేళాలో 88 మంది ఎంపిక


పుంగనూరులో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువకులు

తంబళ్లపల్లె, జూలై 8: ఐటీఐ కోర్సులతో తక్కువ సమయంలోనే మంచి ఉద్యోగాలు సాధించవచ్చని తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా పుంగనూరు ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు తంబళ్లపల్లె, పుంగనూరు ఐటీఐలలో శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 108 మంది నిరుద్యోగ యువకులు హాజరయ్యారు. వారికి పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన 88 మందిని ఎంపిక చేసుకున్నారు. బంగారుపాళ్యం అమర్‌రాజా గ్రోత్ కారిడార్ కంపెనీకు 61 మంది, బెంగళూరు మీనాక్షి పవర్ సొల్యూషన్స్ కంపెనీకు 12మంది, హైదరాబాద్‌కు చెందిన శ్రీ చక్ర కన్వేయర్స్ కంపెనీకు 10 మంది, బెంగళూరుకు చెందిన ఫైన్ కాంపోనెంట్స్ లిమిటెడ్‌కు 5 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన వారికి ఆయా కంపెనీలు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐ టీవో నాగరాజు, ఇన్‌స్ట్రక్టర్లు వెంకటరమణ, సురేంద్రబాబు, అశోక్‌క్‌కుమార్, వరప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె, జూలై 8: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ సూచించారు. సోమవారం మండలంలోని కోటాలలో అతిసార ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ...కలుషితంతో కూడిన ఆహారం, నీరు తీసుకోవడం వలన డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుమలత, ఎంఎల్‌హెచ్‌పి జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎం అరుణ కుమారి, ఆశాలు రామాంజులమ్మ, దొడ్డమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పప్పు జాతి గడ్డితో అధిక పాల దిగుబడి

కలికిరి, జూలై 8: పాడి ఆవులకు పప్పు జాతి గడ్డిని అందజేస్తే అధిక పాల ఉత్పత్తికి అవకాశముంటుందని పశు సంవర్థక శాఖ మదనపల్లె ఉప సంచాలకులు డాక్టర్ కె.సత్యనారాయణ పేర్కొన్నారు. పచ్చి మేత తప్పని సరిగా అందజేస్తేనే నాణ్యమైన పాలు పొందొచ్చని చెప్పారు. సోమవారం మండలంలోని సంద్రావారిపల్లె పంచాయతీలో పశు గ్రాస వారోత్సవాల సందర్భంగా పాడి రైతులకు పచ్చి మేత గురించి అవగాహన కల్పించారు. వివిధ రకాల పశుగ్రాస నమూనాలతో వేదికను అలంకరించి వాటి వివరాలను విలువను తెలిపారు. కలికిరి ప్రాంతీయ వైద్యశాల ఏడీ వెంకటముని నాయుడు, మునేళ్లపల్లె, సంద్రావారిపల్లె సర్పంచులు శశికళ, జహీదా, పంచాయతీ ఇన్‌చార్జీ గంగాధర పాల్గొన్నారు. పలువురు రైతులకు పలు రకాల గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. పాలెం పశవైద్యుడు డాక్టర్ గిరినాథ రెడ్డి, సహాయకుడు వాసుదేవ రెడ్డి, రాజకుమార్, మునేళ్లపల్లె, సంద్రావారిపల్లె రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బి.కొత్తకోట కమిషనర్

బి.కొత్తకోట, జూలై8: అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన శ్రీధర్ చామకూరిని బికొత్తకోట నగరపంచాయతీ కమిషనర్ పీఆర్ మనోహర్ సోమవారం జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బి.కొత్తకోట నగరపంచాయతీ స్థితిగతులపై కలెక్టర్‌కు కమిషనర్ ఆయనకు వివరించినట్లు తెలిసింది.

పంచాయతీకి రూ.3.80 లక్షలు ఆదాయం


వేలం పాటలు నిర్వహిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

ములకలచెరువు, జూలై 8: ములకలచెరువు గ్రామ పంచాయతీకి వేలం పాటల ద్వారా రూ.3,80,500 ఆదాయం వచ్చింది. స్థానిక సచివాలయంలో సోమవారం డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో పోలప్ప ఆధ్వర్యంలో వారపు సంతలో రుసుం వసూలుకు వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ములకలచెరువుకు చెందిన లలిత అత్యధికంగా వేలం పాడి హక్కును దక్కించుకున్నారు. ఈ వేలం పాటల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, టీడీపీ నేతలు చెన్నకిష్టా, కేవీ రమణ, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు శుభ్రంగా ఉండేలా చూడాలి

ములకలచెరువు, జూలై 8: పాఠశాలల్లో తాగునీరు శుభ్రంగా ఉండేలా చూడాలని ఎంఈవో వెంటకరమణ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యా ప్రవేశం కార్యక్రమంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ అందుబాటులో ఉన్న పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠశాలల పరిసరాల్లో ఖచ్చితంగా పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎంలు రమణమూర్తి, సుబ్బరాయప్ప, అమరనాథరెడ్డి, ఆనందరెడ్డి, వెంకటరమణ, కట్టా రమణప్ప, ఉషా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి


పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

పీలేరు, జూలై 8: తిరుపతి లోని రుయా ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్సు యశోదాపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు, వైద్య సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యశోదాపై దాడిని నిరసిస్తూ వారు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు చేయడం ఇటీవలి కాలంలో పరిపాటి అయిందని, దాడుల కారణంగా చాలా మంది సిబ్బంది ఆసుపత్రుల్లోని అత్యవసర విభాగాల్లో పనిచేసేందుకు భయపడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో సరస్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

కలికిరి, జూలై 8: కలికిరిలోని ప్రభుత్వ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. అంజలీ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యా విధానం ద్వారా కళాశాలలో కొత్త కోర్సులను కూడా ప్రారంభిస్తున్నట్లు ఆమె చెప్పారు. బీకాం జనరల్ హానర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ హానర్స్, బీఎస్సీ హానర్స్ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ హానర్స్ (బోటనీ) కోర్సులను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఈ నెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని, 11న మధ్యాహ్నం నుంచి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో కృష్ణా జిల్లాలోని కంచికచర్ల, కలికిరిలో మాత్రమే ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలున్నాయన్నారు. కావలసిన కోర్సులను ఎంచుకునే వెసులుబాటు ఉందని ఆమె వివరించారు.

ఆర్టీసీ వన్ డిపోను ప్రథమ స్థానంలో నిలపాలి

మదనపల్లె అర్బన్, జూలై8: ప్రతి నెలా వన్ డిపోను రీజియన్‌లో మొదటి స్థానంలో నిలపాలని డీఎం వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వన్‌డిపో కార్యాలయంలో ఆర్టీసీ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఆర్ 89.34 శాతం సాధించి రీజనల్‌లో ప్రథమ స్థానంలో, కేఎంపీఎల్ 5.40 సాధించి రెండో స్థానంలో నిలిచిందన్నారు. మాసాంతానికి అందరి సహకారంతో ఈపీకే 45, ఓఆర్ 90 వాతం కేఎంపీఎల్ 5.45 సాధించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన వీఆర్ఎస్ఎస్ నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 8: హిందూపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను అనంతపురంలో వీఆర్ఎస్ఎస్ రాష్ట్రఅధ్యక్షుడు పొదల నరసింహులు, గంపల గంగరాజు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ గత కొ దశాబ్దాలుగా వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం పోరాడుతున్న విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ సాధన బిల్లు సాకారం అయ్యే విధంగా ఒత్తిడి తీసుకురావాలని ఎంపిని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సమితి రాష్ట్ర కార్యదర్శి గంపల గంగరాజు, రాష్ట్ర కోశాధికారి మేకల విజయమోహన్, నాయకులు సుదర్శనబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాహుదా నదిలో గుర్తించని ఇసుక రీచ్‌లు

కలికిరి, జూలై 8: నూతన ఇసుక విధానంపై సోమవారం ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు విడుదలైనా కలికిరి, కలకడ, వాల్మీకిపురం మండలాలకు చెందిన బాహుదా నదిలో ఎక్కడెక్కడ ఇసుక రీచ్‌లు అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని జిల్లా అధికారులు ఇప్పటికీ ప్రకటించలేదు. దీంతో నెల రోజుల పైబడి ఇసుక కోసం వేచి చూస్తున్న వినియోగదారులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. సందట్లో సడేమియాగా రీచ్‌లు బంద్ చేస్తున్నారని తెలియగానే అక్రమార్కులు ఎక్కడికక్కడ ఇసుక డంపులను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున నిల్వ వుంచారు. డిమాండు బాగా పెరగడంతో ప్రస్తుతం ఈ డంప్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ పెద్ద మొత్తంలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. వాస్తవానికి బాహుదా నదిలో వాల్మీకిపురం మండలంలోని కూరపర్తి, మాధవరంపల్లె, కలికిరి మండలంలోని పారపట్ల, చీకటిపల్లె, పల్లవోలు, గుండ్లూరు, అద్దవారిపల్లె, మహల్, కలకడ మండలంలోని గంగాపురం వద్ద గతంలోనే రీచ్‌లను గుర్తించారు. వైసీపీ నాయకులు ఎక్కడికక్కడ అందబాటులో వున్న రీచ్‌లను ఆక్రమించి రూ.కోట్లు దండుకున్నారు. ఇక బాహుదా నదిలో మిగిలిన ఇసుక కోసం ప్రస్తుతం భారీ డిమాండు ఏర్పడింది. దీంతో ముందు చూపుతోనే అక్రమార్కులు ఇసుక డంపులను ఏర్పాటు చేసి డిమాండు వున్న సమయంలో నిల్వలను తరలిస్తున్నారు. బాహుదా నది పరీవాహక గ్రామాల్లో పలుచోట్ల అక్రమ డంపులున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. బాహుదా నదిలోకి అన్ని రీచుల్లోనూ నేరుగా రహదార్లున్నాయి. దీంతో వినియోగదారులు నేరుగా నదిలో నుంచి లోడింగ్ చేయించుకుని తరలించే వెసులుబాటు వుంది. ఇక సీనరేజీ చార్జీల పేరిట ప్రభుత్వానికి టన్నుకు చెల్లించాల్సిన రూ.88లకు జీఎస్టీ ఎంతన్నది జిల్లా కలెక్టరు ప్రకటాంచాల్సి వుంది. లోడింగ్ విషయంలో కూడా కూలీలతో మాత్రమే జరగాలని ప్రభుత్వం నిర్దేశించినందు వల్ల స్థానిక కూలీలకు కూడా సరపడా ఉపాధి లభించనుంది. రీచ్‌ల గుర్తింపును జిల్లా అధికారులు పూర్తి చేస్తే ఇసుక తరలించేందుకు వినియోగదారులు సిద్ధంగా వున్నారని చెపుతున్నారు. ఒక ట్రాక్టరుకు గరిష్టంగా 20 టన్నులు (ఐదు లోడ్‌లు) తోలేందుకు అనుమతించడంతో ఇసుక డిమాండు కూడా బాగా తగ్గే అవకాశముందంటున్నారు. జిల్లా అధికారులు తొందరగా రీచ్‌లు గుర్తించి, ధర నిర్ణయించాల్సిందిగా కోరుతున్నారు.

ఎన్నికల విధుల కార్లకు అద్దెలు ఇప్పించండి

● ఆర్డీవోకు కార్ల డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల వినతి


ఆర్డీవో హరిప్రసాద్‌కు అర్జీ అందజేస్తున్న కార్ల డైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె టౌన్, జూలై 8: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న కార్లకు అద్దెలు ఇప్పించండి సార్! అంటూ కార్ల డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్డీవో హరిప్రసాద్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 32 మంది వివిధ సమస్యలపై ఆర్డీవోకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా నవయువ కార్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో సుమారు 100 కార్లు ఎన్నికల విధుల్లో పాల్గొన్నాయని వాటికి సంబంధించి రూ.28,30,230 అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆర్థికంగా వెనుకబడి, కార్ల అద్దెపై జీవించే తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కార్ల అద్దెలు చెల్లిస్తామన్నారు. మదనపల్లె డివిజన్‌లో 300 మంది చెవిటి, మూగ దివ్యాం గులు ఉన్నారని, వారికి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమపథకాలకు అదనంగా నిరుద్యోగ భృతి, కుట్టుమిషన్లు, స్మార్ట్ ఫోన్లు, 35 కిలోల రేషన్ బియ్యం ఇవ్వాలని మదనపల్లె డివిజన్ చెవిటి, మూగ సంఘం సభ్యులు, గౌరవ సభ్యుడు జి.కృష్ణమూర్తి ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లె వద్ద స్వామికొండ ప్రాంతంలో ఎకరా భూమి ఆక్రమణకు గురైందని, దీనిపై సర్వే చేసి చిన్న జీవాలకు మేత కొరత తీర్చాలని ఎఫ్ఈఎస్ ప్రతినిధి హసీనా ఆర్డీవోకు విన్నవించారు. తనకు మంజూరైన ఇంటి స్థలాన్ని నలుగురు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని రామసముద్రం మండలం మనేవారిపల్లెకు చెందిన మునిరెడ్డి కుమారుడు పురుషోత్తం రెడ్డి ఆర్డీవో ఫిర్యాదు చేశారు. వాటితో పాటు భూ సమస్యలు, పింఛన్ల పునరుద్ధరణ తదితరాలపై పలువురు ఆర్డీవోకు అర్జీలు అంద జేశారు. డీఏవో శ్రీనివాసులు, ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకు రెన్యువల్‌పై సెంట్రల్ డ్రగ్స్ అధికారుల తనిఖీ


బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలను పరిశీలిస్తున్న సెంట్రల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్

మదనపల్లె టౌన్, జూలై 8: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకు రెన్యువల్ అంశమై విశాఖపట్నం నుంచి వచ్చిన సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రఘువరన్ తనిఖీలు నిర్వహించారు. సోమవారం సర్వజన బోధనాస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో నిల్వ చేసిన రక్త బ్యాగ్‌లను పరిశీలించడంతోపాటు ఏయే గ్రూపులు ఉన్నాయో అంశాలను పరిశీలించారు. రక్త పరీక్షల పరికరాలు, నిల్వ చేసిన యంత్రాల పనితీరు పరిశీలించారు. బ్లడ్‌బ్యాంకులో దాతల నుంచి సేకరించిన రక్తం నిల్వలను, రికార్డులో ఉన్న వివరాలను సరిపోల్చుకున్నారు. ఈ విషయమై మదనపల్లె డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి మాట్లాడుతూ బ్లడ్‌బ్యాంకు రెన్యువల్ విషయంలో ఈ తనిఖీలు నిర్వహించామని, నివేదికలను ఢిల్లీలోని సెంట్రల్ డ్రగ్స్ సంస్థకు పంపుతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భార్గవ్, డాక్టర్ అమరావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


కమిషనర్ ప్రమీలకు వినతి పత్రం అందిస్తున్న వార్డు, సచివాలయ ఉద్యోగులు

మదనపల్లె టౌన్, జూలై 8: రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు కోరారు. ఆ మేరకు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకు వారొక వినతి పత్రం అందజేశారు. సోమవారం సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గుడి నాగరాజ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు విన్నవించారు. సచివాలయ ఉద్యోగులు మూడేళ్లుగా బీఎల్‌వోలుగా పనిచేశారని వారికి ఇంత వరకు గౌరవ వేతనం మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల అర్జిత సెలవులను ఎస్ఆర్ రిజిస్టర్‌లో నమోదు చేసి హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని కోరారు. జూలై నెల నుంచి ఇవ్వాల్సిన వార్షిక ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, సతీష్, ప్రసాద్, రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరానికి విశేష స్పందన


నిర్ధారణ శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పీలేరు, జూలై 8: సర్వ శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీలేరు, కేవీపల్లె, కలికిరి, కలకడ మండలాలకు చెందిన 100 మంది 0-18 ఏళ్ల మధ్య వయస్సున్న దివ్యాంగులు శిబిరంలో పాల్గొని ఉపకరణాల కోసం పరీక్షలు చేయించుకున్నారు. పీలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ జనార్దన్, ఎంఈవోలు లోకేశ్వర రెడ్డి, పద్మావతమ్మ, హెచ్ఎంలు ఎర్రయ్య, సురేంద్రనాథరెడ్డి, ఈఎన్‌టీ వైద్యనిపుణులు ఈశ్వర సురేంద్ర, ఆర్థో వైద్యులు సోమశేఖర రెడ్డి, ఆడియో మెట్రీషియన్ మమత, ఫిజియోథెరపిస్టు షహెనాజ్, భవిత పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు మురళీధర్ రాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న పార్టీ మైనార్టీ నేత ఎస్‌కేబాషా

మదనపల్లె అర్బన్, జూలై8: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా అధ్యక్షతన కేక్‌కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ మైనార్టీల అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరమ్మ, మహబూబ్‌పీర్, సమీర్, సయ్యద్, పవన్ కుమార్‌రెడ్డి, బక్ష, పాలేటి, నాగరాజు, పాల్గొన్నారు.



కలికిరిలో: కలికిరిలో సోమవారం వైఎస్ ఆర్ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పీలేరు కాంగ్రెస్ ఇన్‌చార్జీ బి.సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా వున్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. కేకు కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ అమలు చేసిన సంక్షేమ, రైతాంగ అభివృద్ధి కార్య క్రమాల గురించి విరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, దుబ్బా శ్రీకాంత్, రహం తుల్లా, తేజా నాయక్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


ఉర్దూ పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంఈవో రామకృష్ణ

పెద్దమండ్యం, జూన్ 8: పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంఈవోలు మనోహర్, రామకృష్ణలు పేర్కొన్నారు. సోమవారం పెద్దమండ్యం మండలం ఎర్రగుట్టపల్లి, గౌనివారిపల్లి, కలిచెర్ల పాతూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాలల రికార్డులను విడివిడిగా తనిఖీ చేశారు. పాఠశాల్లో మోనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందజేయాలన్నారు. పాతూరు ఉర్దూ పాఠశాలలో జరుగుతున్న పాఠశాల మౌలిక సదుపాయల అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి నిధులు పనుల వివరాలు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకామ్ కోర్సు కొనసాగించాలి

మదనపల్లె టౌన్, జూలై 8: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకామ్ జనరల్ కోర్సులను కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన డిగ్రీ కోర్సుల ప్రవేశానికి నోటిఫికేషన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకామ్ జనరల్ కోర్సులను ఎత్తివేసినట్లు ఉందన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకామ్ జనరల్ కోర్సుల్లో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని, కాని ఉన్నత విద్యాశాఖ ఈ కోర్సులను ఎత్తివేయడం దారుణమన్నారు. కాని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో మాత్రం బీకామ్ జనరల్ కోర్సులను కొనసాగించడం బాధాకరమన్నారు. దీనిపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విచారించి ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించే డిగ్రీ కోర్సుల కౌన్సెలింగ్ లోపు చర్యలు చేపట్టాలని మాదవ్ డిమాండ్ చేశారు.

అది కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్డే

మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇంటిముందు రోడ్డు వివాదంపై నివేదిక సిద్ధం

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో 18వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్- రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ వేసిన రోడ్డు కార్పొరేషన్ నిధులతో వేసిందేనని మున్సిపల్ అధికారులు నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన ఇంటి ముందు కార్పొరేషన్ వేసిన రోడ్లకు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకుండా రెండు వైపులా పెద్ద గేట్లు ఏర్పాటు చేయడంపై వివాదం రేగిన విషయం తెలిసిందే. దీనిపై జనసేన తరపున నాలుగు రోజుల ముందు పెద్దిరెడ్డి ఇంటిముందు ధర్నాకు దిగిన నేపథ్యంలో రోడ్డు వివాదంపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివేదిక కోరారు. మారుతీనగర్-రాయల్ నగర్ కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ.9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20) ఒకటి, రూ.9.50లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20)లతో మరొకటి రెండు విడతలుగా నామినేషన్‌పై టెండరిచ్చినట్టు గుర్తించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డులో నమోదుచేసిన విషయాన్ని కూడా నిర్ధారించారు. అయితే అది తన స్థలమేనని పెద్దిరెడ్డి కోర్టును ఆశ్రయించినట్టు తెలుస్తోంది.

బోయకొండ ఈవో బాధ్యతల స్వీకరణ



ఈవోలు ఏకాంబరం, చంద్రమౌళికి జ్ఞాపికలు అందజేస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, జూన్ 8: బోయకొండ గంగమ్మ ఆలయ ఈవోగా ఏకాంబరం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బోయకొండ ఈవోగా పనిచేస్తున్న చంద్రమౌళి గుంటూరు జోన్ జేఈవోగా బదిలీ అయ్యారు. దీంతో దేవదాయశాఖ కమిషనరు ఆదేశాలతో శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న తాను బోయకొండ ఈవోగా బాధ్యతలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానన్నారు. కాగా, నూతన ఈవో ఏకాంబరం, గుంటూరుకు బదిలీ అయిన ఈవో చంద్రమౌళిని ఆలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

భాకరాపేట ఘాట్‌లో లోయలోకి దూసుకెళ్లిన లారీ



చంద్రగిరి, జూలై 8: చంద్రగిరి మండల పరిధిలోని పీలేరు, తిరుపతి జాతీయ రహదారిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో లారీ అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. భాకరాపేట నుంచి తిరుపతి వైపు వస్తున్న లారీ ఘాట్ రోడ్డు మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో డ్రైవర్ మధుబాబు, క్లీనర్‌లకు ప్రాణాపాయం తృటిలో తప్పింది. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 78,912 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,039 మంది తలనీలాలు సమర్పించారు.

నీట్ సీట్స్ అలాట్‌మెంట్ బుక్‌లెట్లు సిద్ధం

- **9849016661 నంబరుకు వాట్సప్ సందేశం పంపితే వివరాలు**

తిరుపతి(విద్య), జూలై 8: నీట్ సీట్స్ అలాట్‌మెంట్ బుక్‌లెట్లు సిద్ధమైనట్లు ఐఐటీ, నీట్ ఫోరం ఓ ప్రకటనలో తెలిపింది. నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష రాసి ర్యాంక్స్ పొందిన విద్యార్థుల అవగాహన కోసం నీట్-2023 సీట్ అలాట్‌మెంట్ బుక్‌లెట్స్‌ను సిద్ధం చేసినట్టు ఫోరం వెల్లడించింది. మొత్తం 19 బుక్‌లెట్స్ ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్ రౌండ్ 1, రౌండ్ 2, మాప్ అప్ రౌండ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ర్యాంక్ వారీ, రిజర్వేషన్‌వారీగా సీట్ల కేటాయింపు వివరాలను పొందుపరిచినట్టు వెల్లడించారు. డిజిటల్ రూపంలో బుక్‌లెట్లను పొందగోరువారు, ఇతర సమాచారం కోసం నీట్ బుక్‌లెట్ అని టైప్‌చేసి వాట్సప్ నంబరు 98490 16661 నంబరుకు మెసేజ్ పంపాలని సూచించారు.

టీటీడీ గదులు హైజాక్!

- రూ.100 వసతి గది.. రూ.వెయ్యికి విక్రయం
- గదులు దొరకని భక్తులే టార్గెట్
- ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది
- టీటీడీ విచారణలో నివ్వెరపోయే అంశాలు
- నాటి వైసీపీ పాలనా వైఫల్యంతోనే ఈ దుస్థితి



తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులే వారి టార్గెట్. దర్శన సమయం వచ్చే వరకు నిరీక్షించడానికి వసతి అవసరం కనుక అలాంటి వారినే ఎరవేస్తారు!. టీటీడీ వంద, 50 రూపాయలకు అద్దె కిచ్చే గదిని ముందుగానే బుక్ చేసుకుని హైజాక్ చేసి, గదులు దొరకని భక్తులకు అప్పటికప్పుడు రూ.వెయ్యి రూపాయలకు అంటగడతారు. డిమాండ్‌ను బట్టి అంతకుమించి వసూలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనావైఫల్యం పుణ్యమాని పవిత్ర పుణ్యక్షేత్రంలో రోజూ కొందరు ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది. తిరుమలలో గదుల దళారులను అరికట్టేందుకు పోలీస్, విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణలో నివ్వెరపోయే అంశాలు బయటపడుతున్నాయి. మార్ఫింగ్ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో గదులను పొంది బ్లాక్‌లో విక్రయించేందుకు నార్త్ ఇండియా నుంచి కొందరు తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో తిష్ఠవేయడం ఆశ్చర్యపరుస్తోంది.

● అక్రమార్జనకు దందా సాగించేదిలా!

ఆధార్ కార్డులో ఫొటో మార్ఫిడి చేసి గదులను బుక్ చేసుకోవడం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్న వైనం మూడురోజుల క్రితం వెలుగు చూసిన విషయం తెలిసిందే. తొలుత సమీప బంధువు ఆధార్ కార్డుతో గదిని పొంది, ఆ తర్వాత గది కోసం నిరీక్షించే భక్తుడికి బ్లాక్‌లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు విక్రయించడం, విక్రయించే క్రమంలోనే ఆ భక్తుడి నుంచి ఆధార్ తీసుకోవడం, తిరిగి భక్తుడి నుంచి పొందిన ఆధార్ జిరాక్స్‌లోని ఫొటోను మార్చి దళారీ ఫొటో జతచేసి తిరిగి గదిని పొందే పెద్ద స్కాంను భద్రతాధికారులు గుర్తించారు. నవకిశోర్ అనే దళారిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఇదే తరహాలో 25 నుంచి 30 మంది దళారులు గదుల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నట్టు తేలింది. కేవలం గదుల ద్వారా అక్రమాలకు పాల్పడేందుకే మహారాష్ట్ర నుంచి కొంతమంది కుటుంబాలతో వచ్చి తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో గదులకు అద్దెకు తీసుకుని నివాసముంటున్నట్లు కూడా తేలింది. తెలంగాణ, కర్ణాటకల నుంచి కూడా మరికొంతమంది తిరుపతికి వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది. ఉదయం భక్తుల్లా తిరుమలకు వచ్చి గదుల ద్వారా వచ్చే సొమ్మును జేబులో వేసుకుని తిరిగి కొండ దిగేస్తున్నట్టు విచారణలో తేలింది. దీన్నిబట్టి గదులను బ్లాక్‌లో విక్రయించడం ద్వారా ఏ స్థాయిలో సంపాదన ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక్కొక్కరు కనీసం రూ.60వేల నుంచి లక్ష వరకు అక్రమంగా సంపాదిస్తుండగా.. సమయానికి గదులు దొరక్క భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే తిరుమలలో ఇలాంటి దుస్థితి నెలకొందని, కూటమి సర్కారు ప్రక్షాళన చేపట్టి ఇలాంటి అక్రమాలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో వినతుల వెల్లువ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూలై 7: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ అర్జీలను స్వీకరించారు.బాధితుల సమస్యలను ఆలకిస్తూ...అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా అధికారులకు సూచనలు ఇచ్చారు. రెవెన్యూ సమస్యలపై సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లేదా ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపారు. అప్పటికప్పుడు పరిష్కారం కాని సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 194 మంది అర్జీదారులు హాజరై వినతిపత్రాలను ఇచ్చారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి 171, డీఆర్వోకు 5, నేషనల్ హైవేకు 5, పోలీసుశాఖకు 3 అర్జీలు అందగా మిగిలిన మున్సిపాలిటీ, డ్వామా, డీసీవో, ఎస్ఎస్ఏ, తదితర శాఖలకు 10 అర్జీలు అందాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కాగా, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరులు వినతిపత్రాలను స్వీకరించారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని...

- గత ప్రభుత్వం రద్దు చేసిన సామాజిక భద్రత పింఛన్లను పునరుద్ధరించాలని జిల్లా బధిరుల సంఘం నేతలు డిమాండు చేశారు. ఒకే కుటుంబంలో ఇద్దరు బధిరులుంటే ఇద్దరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. సబ్సిడీ రుణాలను అందించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ల పంపిణీలో తప్పులు జరుగుతున్నాయని, వాటి వల్ల నిజమైన బధిరులు నష్టపోతున్నారన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో తమకు న్యాయం చేయాలని కోరారు.
- రస్తా పరంబోకు భూములు ఆక్రమణలకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గంగవరం మండలం గొర్రెలదొడ్డి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారుడిపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.
- తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి హామీ పథక క్షేత్రసహాయకులు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 20వేలు ఇవ్వాలని, అర్హులకు పదోన్నతులు, రాజకీయ ఒత్తిళ్లను నివారించాలని కోరారు.



ఉపాధిసిబ్బందికి న్యాయం చేయాలని కలెక్టరేట్‌కు వచ్చిన ఉద్యోగులు



- శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని చిత్తూరు చర్చిల అభివృద్ధి సమితి అధ్యక్షుడు రెవరెండ్ జోబ్, కోశాధికారి రెవరెండ్ రాబర్ట్ ఫిర్యాదు చేశారు. చిత్తూరు రూరల్ మండలం అనుప్పల్లి పంచాయతీ వైఎస్సార్ నగర్‌లో కేటాయించిన భూమిలోకి తమను వెళ్లనీయకుండా అసాంఘిక శక్తులు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నాయని ఆరోపించారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, జిల్లా అధికారులే న్యాయం చేయాలని కోరారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 39 ఫిర్యాదులు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఇందులో డబ్బు తగాదాలు 11, భూ తగాదాలు 14, వేధింపులు 6, ఆస్తి తగాదాలు 5, కుటుంబ తగాదాలు 3 వంతున అందాయి. కార్యక్రమంలో ఏఎస్పీ అరీఫుల్లా, దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ





రోడ్డు పక్కనే కూర్చున్న జనం, వాహనాల డ్రైవర్లు, పార్కింగ్‌స్టాండ్‌లో కూర్చున్న అర్జీదారులు

వసతుల్లేక.. అర్జీదారుల ఇక్కట్లు

చిత్తూరు, జూలై 7: జిల్లా కలెక్టరేట్‌కు వివిధ పనులపై వచ్చే ప్రజల బాధలు వర్ణనాతీతం. కనీస వసతులైన బెంచీలు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కలెక్టరేట్ సముదాయంలో దాదాపు 50శాఖలకు పైనే వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. ఈ కార్యాలయాల్లో వివిధ పనులపై ప్రతి రోజు వందల మంది ప్రజలు వస్తుంటారు. కార్యాలయాల్లో జరిగే సమావేశాలకు ఇతర ప్రాంతాల నుంచి అధికారులు, రాజకీయ నాయకులు కూడా వందల సంఖ్యలో వచ్చిపోతుంటారు. ఇక సోమవారమైతే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల వందల సంఖ్యలో అర్జీదారులు వస్తుంటారు. వారికి సరిపడే సౌకర్యాలను కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. అర్జీలివ్వడానికి వచ్చే వారికి హాలు ముందు ఉన్న పార్కింగ్‌షెడ్డులో కుర్చీలు వేసి ఉంచారు.

వారితో పాటు వచ్చే వారు గంటల తరబడి నిల్చోవాల్సిన పరిస్థితి ఉంది. అంతేకాకుండా అధికారులను తీసుకొచ్చే వాహన డ్రైవర్లు, రాజకీయ నాయకులతో వచ్చే కార్యకర్తలు, నాయకులు సైతం చెట్ల కిందనో, వాహనాలపైనో కూర్చుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కూర్చోడానికి బెంచీలు, తాగునీటి వసతి కల్పించాల్సిన అవసరముంది.

ఎన్‌ఆర్‌ఐ కిడ్నాప్

నగలు, నగదు లాక్కుని వదిలిపెట్టిన వైనం

శ్రీకాళహస్తి, జూలై 8: విదేశాల్లో చాలాకాలం ఉద్యోగం చేసి తిరుపతిలో స్థిరపడేందుకు సిద్ధమైన ఓ ఎన్‌ఆర్‌ఐను కొందరు కిడ్నాప్ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది.తిరుపతికి చెందిన కృష్ణమూర్తి(65) సుదీర్ఘకాలం వివిధ దేశాల్లో ఉద్యోగాలు చేశాడు. ఇటీవల సొంతూరు తిరుపతికి వచ్చి చైన్‌లింక్ వ్యాపారం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేసే యువతి(26)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య బాగా చనువు పెరిగింది. గతంలో ఎర్రచందనం కేసులో నిందితుడిగా వుండిన ఆ యువతి భర్త ఎలాగైనా కృష్ణమూర్తిని దోపిడీ చేయాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో తనతో పాటు ఎర్రచందనం కేసులో నిందితుడైన మరో యువకుడిని సహాయంగా ఎంచుకున్నాడు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో కొందరు సభ్యులు చైన్‌లింక్ వ్యాపారంలో చేరుతారని కృష్ణమూర్తిని నమ్మించారు.ఈనెల 3వ తేదీ కారులో అందరూ రాజీవ్‌నగర్‌కు చేరుకున్నారు. ఇక్కడ యువతి భర్త ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కృష్ణమూర్తి సెల్‌ఫోన్ లాక్కుని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాడు. అక్కడినుంచి మరో ఇద్దరి సాయంతో కేవీబీపురం మండలం పెరిందేశానికి తరలించారు. కృష్ణమూర్తి వద్ద ఉన్న కొంత నగదుతో పాటు బంగారు ఆభరణాలను లాక్కున్నారు. అలాగే బ్యాంకు ఖాతాలోని రూ.3లక్షల నగదును ఏటీఎం, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా స్వాహా చేశారు. ఆ తరువాత కృష్ణమూర్తి భార్యకు ఫోన్‌చేసి రూ.కోటి డిమాండ్ చేశారు. 4వ తేదీ పెరిందేశం నుంచి కారులో కృష్ణమూర్తిని ఎక్కించుకుని శ్రీకాళహస్తి మండలంలోని పల్లెల మీదగా సంచరించారు. అతని నుంచి డబ్బులు రావని నిర్ధారించుకున్న తరువాత రాజీవ్‌నగర్‌లో వదిలిపెట్టి పరారయ్యారు. రెండు రోజుల పాటు దుండగుల మధ్య నలిగి గాయపడిన కృష్ణమూర్తి నేరుగా తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాడు. కోలుకున్నాక సోమవారం రాత్రి శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కిడ్నాప్ ఘటనపై ఫిర్యాదు చేశాడు. దీంతో కిడ్నాప్‌కు పాల్పడిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సంస్కృతవర్సిటీలో బ్రిడ్జ్ కోర్సు ప్రారంభం

తిరుపతి రూరల్, జూలై 8: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా ఆచార్య(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐదురోజులపాటు నిర్వహించే బ్రిడ్జ్ కోర్సుని సోమవారం వర్సిటీలోని చెలికాని అన్నారావు సభా భవనంలో ప్రారంభించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్సిటీలో ఆఫర్‌చేసే 15కిపైగా వివిధశాస్త్రాలకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు పరిచయం చేసేందుకు ప్రతిఏటా ఈ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్కృత భాష, శాస్త్రాల్లోని జ్ఞానాన్ని సరళంగా, సులభంగా తెలుసుకునేందుకు ఈ బ్రిడ్జ్ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అకడమిక్‌డీన్ శుక్లా, కోఆర్డినేటర్ సి.రంగనాథన్, అడిషనల్ కోఆర్డినేటర్ యశస్వి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాముకాటుకు రైతు మృతి



చంద్ర(ఫైల్)

పుంగనూరు రూరల్, జూలై 8: పాముకాటుకు ఓ రైతు మృతి చెందిన ఘటన సోమవారం పుంగనూరులో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకుల కథనం మేరకు.. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె పంచాయతీ ఆవులపల్లెకు చెందిన ఎల్లప్ప కుమారుడు చంద్ర(45) ఆదివారం పొలంలో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. ఈయన కేకలతో సమీప పొలాల్లోని రైతులు చేరుకుని చంద్రను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు అతని పరిస్థితి విషమించదని చెప్పడంతో తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఒక స్మగ్లర్ అరెస్టు



పట్టుబడ్డ ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, జూలై 8: అన్నమయ్య జిల్లా పీలేరు అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం కూంబింగ్ నిర్వహించి, 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన విష్ణువర్ధన్‌కుమార్ బృందం ఆదివారం అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలం పీలేరు అటవీ ప్రాంతంలో ఎల్లమందకు చేరుకుని మంచాల మంద వైపు కూంబింగ్ చేసుకుంటూ వెళ్లారు. తెల్లవారుజామున వీరు మారెళ్ల అటవీ బీటు పరిధిలో పింఛానది సమీపానికి చేరుకోగా కొంతమంది వ్యక్తులు తలలపై ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా.. వారు దుంగలను పడేసి పారిపోయారు. వారిని వెంబడించిన పోలీసులు ఒకరిని పట్టుకోగలిగారు. అతడు తమిళనాడు వేలూరు జిల్లా అనైకట్టు ప్రాంతానికి చెందిన బలరామన్ పెరియస్వామి(44)గా గుర్తించి, అరెస్టు చేశారు. అక్కడ పడి ఉన్న 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లోని సిబ్బందికి రక్షణ కల్పించండి

రుయా పరిపాలనా భవనం ముందు స్టాఫ్ నర్సుల నిరసన



నినాదాలు చేస్తున్న నర్సులు

తిరుపతి(వైద్యం), జూలై 8: విధుల్లోని సిబ్బందికి రక్షణ కల్పించాలని రుయాస్పత్రిలోని స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రి పరిపాలన భవనం ముందు నిరసన తెలిపారు. ఏఎంసీ వార్డుకు విధులకు హాజరైన కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు యశోదపై ఆదివారం రాత్రి ఓ రోగి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయాన్ని ఖండించారు. వీరికి మద్దతుగా ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీఎన్జీవోస్ నేతలు వరప్రసాద్, సురేష్ నిలిచారు. నేతలు మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులకు భద్రతగా మగ సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. వెంటనే జరిగిన విషయంపై విచారణ చేపట్టి బాధితురాలికి వైద్య ఖర్చులు భరించడమే కాకుండా వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం యూనియన్ నేతలతో కలిసి స్టాఫ్‌నర్సులు సూపరింటెండెంట్ రవిప్రభుకు వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన వ్యక్తికి మతిస్థిమితం లేని కారణంగా ఇలాంటి దురదృష్ట ఘటన జరిగిందని, అతనిపై చర్యలు తీసుకుంటామని, బాధితురాలికి సెలవులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. హెడ్‌నర్సులు, రాధ, భువనేశ్వరి ఏపీ హంస నేతలు ఇమ్రాన్, గిరిబాబు, శాంతకుమార్, స్వర్ణలత, జయలక్ష్మి పాల్గొన్నారు.

దాడి ఘటనపై మంత్రి ఆరా

సోమవారం సాయంత్రం రుయా సూపరింటెండెంట్ రవిప్రభుకు ఫోన్ చేసి జరిగిన ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. బాధితురాలు కోలుకునే వరకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేస్తామని, వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కాగా, తక్షణమే స్పందించిన మంత్రికి ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుడిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం): స్టాఫ్ నర్సుపై దాడి చేసిన ఘటనలో నిందితుడు దుర్గాప్రసాద్‌పై తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ జయనాయక్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం రాజానగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ రుయాలో చికిత్స పొందుతున్నాడు. శనివారం రాత్రి అట్రాసిన్ ఇంజక్షన్ ఇచ్చారు. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయి ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విధులకు హాజరైన స్టాఫ్ నర్సు యశోదపై ఉన్నట్టుండి సెలైన్ స్టాండుతో తలపై దాడి చేశాడు. నర్సు తలకు తీవ్రగాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు చికిత్స పొందుతుండడంతో డిశ్చార్జి చేశాక అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

తిరుమలేశుడి సేవలో కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి



తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థస్వామి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో మహాద్వారం వద్దకు చేరుకున్న విద్యాప్రసన్నకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శిష్యబృందంతో ఆలయంలోకి వెళ్లిన విద్యాప్రసన్న ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీవారిని గోవా స్పీకర్ రమేష్ తవడ్కర్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.